

● రూ.5 లక్షల పరిహారం

విద్యార్థి గురుమహేంద్ర మృతిపై రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అమరావతిలోని తన చాంబర్‌లో నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ జరిగిన ప్రమాద విషయాన్ని తెలియచేశారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ జరిగిన ఘటనపై వెంటనే విచారణ చేపట్టాలని డీఈఓకు ఆదేశాలు జారీ చేశారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రభుత్వం తరపున అండగా నిలుస్తామని, రూ.5లక్షల పరిహారం అందచేస్తామన్నారు. శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి చెక్కును అందిస్తామని తెలిపారు.

రేయ్.. గురూ లేవరా!



కుమారుడు గురుమహేంద్ర మృతదేహంపై విలపిస్తున్న తల్లిదండ్రులు

- కేఎన్‌ఆర్ పాఠశాలలో దారుణం
- కుప్పకూలిన భవన సన్‌షేడ్, గోడ
- విద్యార్థి దుర్మరణం
- గుండెలవిసేలా రోదించిన తల్లిదండ్రులు
- పిల్లలున్న చోట జాగ్రత్తగా ఉండాలి కదా : డీఈవో
- వందల మందికి ఇద్దరే టీచర్లు ఎలా..? : హెచ్‌ఎం
- బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం : మంత్రి నారాయణ
- 'నాడు-నేడు' పనుల్లో బయటపడ్డ డొల్లతనం

నాడు-నేడు
పనులను నాసిరకంగా చేపట్టడం
తోపాటు నిధులు ఇవ్వక అర్ధంతరంగా పనులు
ఆపించిన గత ప్రభుత్వ పాలకులదా!?.
సగం పనులు జరిగిన భవనం వద్దకు పిల్లలను వెళ్లకుండా
చూడాల్సిన బాధ్యతను విస్మరించిన ఉపాధ్యాయులదా!?
ఇలా తప్పు ఎవరిదైనా ఆ తల్లికి మాత్రం పుత్రశోకం మిగిల్చింది. 'స్కూలుకు వెళ్లొస్తానమ్మా' అంటూ ఉదయం ఇంట్లో నుంచి వెళ్లిన కుమారుడు సాయంత్రం నిర్జీవంగా కనిపించడంతో కన్నపేగు విలవిల్లాడిపోయింది. నవమాసాలు మోసి కంటికి రెప్పలా పెంచుకున్న కొడుకు ఇక లేడని తెలుసుకున్న ఆ తల్లి గుండె పగిలేలా విలపించింది. 'ఓ దేవుడా ఏం పాపం చేశామయ్యా.. మా బిడ్డను పొట్టన పెట్టుకున్నావే.. రేయ్ గురు... లేవరా!?'నంటూ రోదిస్తున్న ఆ మాతృమూర్తిని చూసి అందరి కళ్లు చెమ్మగిల్లాయి. నెల్లూరులోని కేఎన్‌ఆర్ పాఠశాలలో శుక్రవారం సాయంత్రం నిర్మాణంలో ఉన్న భవనం గోడ కూలి కిందపడటంతో ఓ విద్యార్థి మృతి చెందడం అందరినీ శోకసంద్రంలో ముంచెత్తింది.

నెల్లూరు (విద్య/క్రైం), జూలై 26 : తిరుపతి జిల్లా వెంకటగిరి ప్రాంతానికి చెందిన కొత్తపాలెం గురవయ్య, రూప దంపతులకు ఇద్దరు కుమారులు. బిడ్డల చదువుల కోసం వీరు నెల్లూరుకు వలసొచ్చారు. నగరంలోని ఇస్కాన్ సిటీలోని ఓ అపార్ట్‌మెంట్‌లో గురవయ్య వాచ్‌మన్‌గాను, రూప కూలి పనులకు వెళుతోంది. వీరి చిన్న కుమారుడు గురుమహేంద్ర (14) కేఎన్‌ఆర్ నగరపాలక సంస్థ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. రోజులాగే శుక్రవారం ఉదయం పాఠశాలకు వెళ్లిన మహేంద్ర సాయంత్రం లాంగ్‌బెల్ తర్వాత నిర్మాణంలో ఉన్న నాడు-నేడు రెండవ దశ అదనపు తరగతి గదుల మొండి గోడల వద్దకు వెళ్లి గోడపైన ఉన్న సన్‌షేడ్‌ను పట్టుకొని ఆడుకుంటున్న సమయంలో సన్‌షేడ్, దానిమీద ఉన్న గోడ విరిగి గురుమహేంద్రపై పడ్డాయి. ఇది గమనించిన తోటి విద్యార్థులు అక్కడే ఉన్న ఉపాధ్యాయులకు తెలిపారు. హుటాహుటిన వారు ఘటనాస్థలికి చేరుకొని శిథిలాల కింద ఉన్న విద్యార్థిని బయటకు తీశారు. గురుమహేంద్ర తలపై గోడ బలంగా పడటంతో అప్పటికే మృతి చెంది ఉండటాన్ని గుర్తించారు. ప్రధానోపాధ్యాయుడు ఎం.విజయ ప్రకాష్ వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నగర డీఎస్పీ శ్రీనివాసులరెడ్డితోపాటు ఇన్‌స్పెక్టర్ నారాయణ స్కూలు వద్దకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. సమాచారం అందుకున్న విద్యార్థి తల్లిదండ్రులు పాఠశాల వద్దకు చేరుకొని గుండెలవిసేలా రోదించారు. జీజీహెచ్‌లో పోస్టుమార్టం అనంతరం విద్యార్థి మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు. వందల మంది విద్యార్థులకు ఇద్దరే ఉపాధ్యాయులు ఉండటంతో విద్యార్థులను అదుపు చేయడం కష్టంగా మారుతోందని, అందుకే ప్రమాదం జరిగిందని పాఠశాల హెచ్‌ఎం పోలీసుల ఫిర్యాదులో పేర్కొన్నారు.



విద్యార్థి
గురుమహేంద్ర (ఫైల్)

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

కేఎన్‌ఆర్ పాఠశాలలో జరిగిన ప్రమాద ఘటనకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ది పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ నాయకులు డిమాండ్ చేశారు. పేరెంట్స్ కమిటీ నేతలు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మాట్లాడారు. జిల్లాలో అసంపూర్తిగా నిర్మాణాలు చేసి నిలిపివేసిన భవానాల వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే జరిగిన అక్రమాలకు, సంఘటనలకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.నరహరి, నేతలు తదితరులు ఉన్నారు.



ఘటనాస్థలిని పరిశీలిస్తున్న డీఈవో రామారావు

బయటపడ్డ డొల్లతనం

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు గత వైసీపీ ప్రభుత్వం కోట్లాది రూపాయలతో నాడు-నేడు పనులు చేపట్టింది. పాఠశాలల్లో పది రకాల పనులకు పాఠశాల స్థాయి, అవసరాన్ని బట్టి నిధులు కేటాయించి ఆయా పాఠశాలల కమిటీల బ్యాంకు ఖాతాలకు నిధులు జమ చేశారు. ఈ పనులను కాంట్రాక్టర్లకు అప్పగిస్తే నాణ్యతాలోపాలతోపాటు నిధులు దుర్వినియోగం అవుతాయన్న ఉద్దేశంతో తల్లిదండ్రుల కమిటీ సభ్యుల నిర్ణయం మేరకు హెచ్‌ఎంల పర్యవేక్షణలో పనులు చేపట్టాలని నాటి ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. అయితే జిల్లాలో మాత్రం అత్యధిక ప్రాంతాల్లో పేరెంట్స్ కమిటీల్లో వైసీపీకి చెందిన నాయకులే కీలకంగా వ్యవహరిస్తూ ఇష్టానుసారంగా పనులు చేపట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. నిర్మాణ సామగ్రి మొదలు పనుల వరకు నాసిరకంగా జరిగాయని అప్పట్లో విమర్శలు గుప్పుమన్నాయి. అందులో భాగంగానే కేఎన్‌ఆర్ నగరపాలక ప్రాథమిక పాఠశాలలో భవన నిర్మాణ పనుల్లో డొల్లతనం బయటపడింది. గత ఏడాది డిసెంబరులో కూడా నగరంలోని దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పనుల్లో భాగంగా నిర్మిస్తున్న పాఠశాల భవనానికి సంబంధించిన మెట్లు నాసిరకంగా నిర్మించడంతో ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ సమయంలో విద్యార్థులు లేకపోవడంతో ప్రాణహాని తప్పింది. వెంటనే అప్రమత్తమైన అధికారులు కూలిన నిర్మాణం ఎవరి కంటా పడకుండా వేగవంతంగా పనులు చేపట్టారు.



వాదులాడుకుంటున్న డీఈవో, హెచ్‌ఎం

● డీఈవో వర్సెస్ హెచ్‌ఎం

స్కూలు వద్దకు చేరుకున్న డీఈఓ రామారావు జరిగిన విషయాలను తెలుసుకుని హెచ్‌ఎం విజయప్రకాష్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. సరైన రక్షణ తీసుకుని ఉంటే ప్రమాదం జరిగి ఉండేది కాదని ప్రశ్నిస్తుండగా హెచ్‌ఎం సైతం డీఈఓపై విరుచుకుపడ్డారు. పాఠశాలలో వందలాది మంది విద్యార్థులున్నా ఇద్దరు టీచర్లనే కేటాయించారని, ఇద్దరితో రక్షణ ఎలా సాధ్యమవుతుందంటూ నిలదీయడంతో పక్కనే ఉన్న ఇతర అధికారులు సర్దిచెప్పి పంపేశారు. కాగా, పాఠశాలలో జరిగిన ఘటనపై విచారణ చేపడతామని డీఈఓ తెలిపారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఎస్ఏ ఏపీసీ సీహెచ్.ఉషారాణి, ఆర్డీఓ మలోల, డిప్యూటీ ఈఓ లక్ష్మీ ప్రసన్న, కార్పొరేషన్ అదనపు కమిషన్ శర్మద, టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, జనసేన నాయకుడు కిశోర్ తదితరులు పరిశీలించి జరిగిన ఘటనపై పూర్తి విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

● విద్యార్థి సంఘాల ఆందోళన

నాసిరకం నిర్మాణాలతోనే గోడ కూలి విద్యార్థి మృతి చెందాడంటూ విద్యార్థి సంఘాలు కేఎన్‌ఆర్ పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టాయి. అధికారులు నిర్లక్ష్యం కారణంగానే ఈ ఘటన జరిగిందని, విద్యార్థి కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. జరిగిన ఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకోకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



కేఎన్‌ఆర్ పాఠశాలలో అర్ధంతరంగా ఆగిన భవన నిర్మాణాలు

బోర్డు పరిమితి మేరకే పొగాకు పండించాలి

చైర్మన్ యశ్వంత్‌కుమార్ వెల్లడి ● అనధికార పొగాకు కొనుగోళ్లు ప్రారంభం



కందుకూరు-2 వేలం కేంద్రంలో పొగాకు వేలంను పరిశీలిస్తున్న బోర్డు చైర్మన్, వైస్ చైర్మన్ తదితరులు

కందుకూరు, జూలై 26: రానున్న సీజన్‌లో పొగాకు బోర్డు ఇచ్చిన పరిమితి మేరకే రైతులు పొగాకు పండించాలని లేకుంటే నష్టపోతారని పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్ సూచించారు. వైస్ చైర్మన్ గుత్తా వాసుబాబుతో కలిసి శుక్రవారం ఆయన కందుకూరులోని వేలం కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అపరాధ రుసుము లేకుండా అనధికార పొగాకు కొనుగోళ్లను ఆయన ప్రారంభించి వేలం తీరును పరిశీలించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో పొగాకుకు మంచి డిమాండ్ ఉన్నందున రైతులకు మంచి ధరలు ఇచ్చి కొనుగోలు చేయాలని వ్యాపారులకు సూచించారు. అనంతరం రైతులతో సమావేశమై పొగాకు మార్కెట్ స్థితిగతులను వివరించారు. వచ్చే సంవత్సరం పరిమితికి మించి పొగాకు పండిస్తే అపరాధ రుసుము విధించేందుకు తాము అంగీకరించి ఈ అనుమతి తీసుకురావటం జరిగిందని వివరించారు. వచ్చే సంవత్సరం అంతర్జాతీయంగా మార్కెట్ ఎలా ఉంటుందో కూడా చెప్పలేమని అందువల్ల ప్రస్తుత ధరలను దృష్టిలో పెట్టుకుని అధిక ధరలకు పొలాలు, బ్యారన్లు లీజుకు తీసుకుని పొగాకు సాగుచేయటం వల్ల ఇబ్బందిపడే అవకాశం ఉందని అన్నారు. ఈ సందర్భంగా చైర్మన్, వైస్‌చైర్మన్‌లను రైతులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారి రాజగోపాల రెడ్డి, రైతుప్రతినిధులు, బయ్యర్లు పాల్గొన్నారు.

మళ్లీ అక్కడే!

- పట్టాలు తప్పిన గూడ్సు వ్యాగిన్
- వెనువెంటనే మరమ్మతుల పూర్తి
- తరచూ పట్టాలు తప్పడంపై ఉన్నతాధికారుల ఆరా



పట్టాలు తప్పిన వ్యాగిన్‌ను పైకి లేపుతున్నరైల్వే సిబ్బంది



విరిగిన సపోర్ట్ రైల్ పట్టా

బిట్రగుంట, జూలై 26 : బిట్రగుంట రైల్వేస్టేషన్ పరిధిలో రెండోసారి గూడ్సురైలు పట్టాలు తప్పడం అధికారుల్లో కునుకులేకుండా చేసింది. శుక్రవారం తెల్లవారుజామున 4.20 గంటలకు నెల్లూరు నుంచి విజయవాడ వైపు వెళ్లే గూడ్సు రైలు దక్షిణ యాడ్ క్రాస్ పాయింట్ వద్ద పట్టాలు తప్పింది. మెయిన్ లైన్ నుంచి లూప్ లైన్ ద్వారా రోడ్ నెం.8లోకి వెళ్లి క్రమంలో పట్టాలు తప్పినట్లు గుర్తించారు. గూడ్సు వ్యాగిన్ ముందు చక్రాలు మాత్రమే పట్టాలు దిగాయి. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు పట్టాలు తప్పిన వ్యాగిన్‌ను తొలగించి ఎల్సీగేట్ 144 వద్ద వాహనదారులకు ఇబ్బంది లేకుండా చేశారు. బిట్రగుంట, కావలి పీడబ్ల్యూఐ అధికారులు, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని హైడ్రాలిక్ పవర్ మిషన్ సహాయంతో వ్యాగిన్‌ను యథావిధిగా పట్టాలపైకి చేర్చారు. మెయిన్ లైన్ క్రాస్ పాయింట్‌కు 30 అడుగుల దూరంలో సపోర్టింగ్ రైలు పట్టా విరగడంపై అధికారులు ఆరా తీస్తున్నారు. మూడు రోజుల క్రితం కూడా ఇదే ప్రాంతంలో గూడ్సు రైలు పట్టాలు తప్పింది. దీంతో అధికారులు సందిగ్ధంలో పడ్డారు. గూడురు, నెల్లూరు స్టేషన్ల తనిఖీ నిమిత్తం విచ్చేసిన ఉన్నత అధికారులకు ఈ విషయం తెలియడంతో ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు.

చేసిన పాపాలకు శిక్ష అనుభవించక తప్పదన్నది చరిత్ర చెబుతున్న నిజం. అధికారమే అండగా వైసీపీ నేతలు సాగించిన దోపిడీ అంతా ఇంతా కాదు. క్వార్ట్జ్ (తెల్లరాయి), సిలికా వంటి విలువైన ప్రజా సంపదను కొల్లగొట్టి రూ.వేల కోట్లు దోచుకున్నారు. ఈ అక్రమాల పుట్టబద్ధలయ్యే సమయం ఆసన్నమైంది. జిల్లాలోని ఖనిజ సంపద దోపిడీని ఎన్డీయే కూటమి ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలో జరిగిన ఈ దోపిడీపై విచారణకు ఆదేశించింది. పలు జిల్లాల అధికారులతో ఏడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. వెంటనే నెల్లూరుకు చేరుకున్న విచారణాధికారులు తవ్వకాలు జరిగిన ప్రాంతాల్లో కొలతలు తీస్తున్నారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదిక సమర్పించు న్నారు. ఆ నివేదికలు అందిన వెంటనే ప్రభుత్వం క్రిమినల్ కేసులతో పాటు అక్రమార్కుల నుంచి దోచుకున్న ప్రజా సంపదను రికవరీ చేయాలని నిర్ణయించుకుంది. దీంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

- క్వార్ట్జ్, సిలికా అక్రమాలపై ప్రభుత్వం సీరియస్
- పూర్తిస్థాయి విచారణకు ఆదేశిస్తూ ఉత్తర్వులు
- పలు జిల్లాల అధికారులతో ఏడు బృందాలు
- వెంటనే రంగంలోకి దిగిన విచారణాధికారులు
- రూ.వేల కోట్ల ప్రజా సంపద దోచిన వైసీపీ నేతలు
- ప్రభుత్వ నిర్ణయంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు

తవ్వింది ఎంత.. దోచింది ఎంత!?

నెల్లూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : సైదాపురం, పొదలకూరు, గూడూరు రూరల్, రాపూరు మండలాల్లో ఎక్కడపడితే అక్కడ వైసీపీ నాయకులు విచ్చలవిడిగా తెల్లరాయిని తవ్వుకెళ్లారు. ప్రభుత్వం, అటవీ భూములతో పాటు పట్టా భూముల్లోనూ రైతులు, మైనింగ్ లీజుదారులను బెదరించి క్వార్ట్జ్‌ను కొల్లగొట్టారు. అప్పట్లో ప్రతిపక్ష నేతలు ఈ తవ్వకాలను అడ్డుకున్నా, ప్రజలు గగ్గోలు పెట్టినా ప్రభుత్వ పెద్దలు పట్టించుకోలేదు. వైసీపీ నేతలే తెరవెనుక ఇదంతా చేయించడంతో నాడు ఎవరూ నోరు మెదపలేదు. చివరకు టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడంతో అధికార యంత్రాంగం ఎన్నికల కోడ్ వచ్చాక విచారణకు పూనుకుంది. దాదాపు ఆరు లక్షల మెట్రిక్ టన్నుల క్వార్ట్జ్‌ను దోపిడీ చేసినట్లు నిర్ధారించి, రూ.255 కోట్ల పెనాల్టీలు విధించారు. దీని విలువ బహిరంగ మార్కెట్లో రూ.వేల కోట్లు ఉంటుంది. ఈ అక్రమ తవ్వకాలకు వైసీపీ నేతలు బాధ్యులని గుర్తించి దాదాపు 200 మందికి మైనింగ్ అధికారులు నోటీసులు కూడా జారీ చేశారు. తాజాగా మరోసారి క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలపై పూర్తిస్థాయిలో విచారించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

● బెదిరించి లాగేసుకొని..!

చిల్లకూరు, కోట మండలాల్లోని అరుదైన సిలికా ఖనిజాన్ని వైసీపీ నేతలు హైజాక్ చేశారు. లీజుదారులను బెదరించి మైన్‌లను బల వంతంగా లాగేసుకున్నారు. 80 లీజులు ఉండగా అన్నిటినీ వైసీపీ నేతల చేతుల్లోకి వెళ్లిపోయాయి. నాడు మైనింగ్ లీజుదారులు టన్ను సిలికాను రూ.400 ధరతో డీలర్ లైసెన్సుదారులకు విక్రయించేవారు. వీరు కంపెనీలకు రూ.600 చొప్పున విక్రయించుకునేవారు. కానీ వైసీపీ ప్రభుత్వం వచ్చాక సిలికా మొత్తాన్ని లాగేసుకొని మైన్ లీజుదారులకు టన్ను రూ.100 చొప్పున ఇచ్చారు. అదే సిలికాను డీలర్ లైసెన్సుదారులకు రూ.1400 చొప్పున అమ్మడం ప్రారంభిం చారు. డీలర్లు టన్ను సిలికాను రూ.1800కు కంపెనీలకు విక్రయించా ల్సి వచ్చింది. దీంతో కంపెనీలన్నీ జిల్లాలోని సిలికాకు బదులు గుజరాత్, రాజస్థాన్ ప్రాంతాల నుంచి కొనుగోలు చేయడం మొదలుపెట్టాయి. ఇక అక్రమార్కులు దాదాపు 400 ఎకరాల ప్రభుత్వ భూము ల్లో కూడా సిలికాను తవ్వేశారు. కొందరు రైతులను బెదిరించి రూ.3 లక్షల చొప్పున ఇచ్చి ఆ భూముల్లో కూడా సిలికాను ఎత్తేశారు. ఇలా ఐదేళ్లపాటు సాగించిన దోపిడీ ద్వారా రూ.వేల కోట్ల ప్రజా సంపదను కొల్లగొట్టారు.



సైదాపురం మండలంలో అక్రమ తవ్వకాలపై ఆరా తీస్తున్న విచారణాధికారులు

● విచారణకు ఏడు బృందాలు

సిలికా, క్వార్ట్జ్ అక్రమాలపై విచారణకు ఏడు బృందాలను ఏర్పాటు చేస్తూ మైనింగ్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ రెండు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేశారు. మూడు బృందాలకు నెల్లూరు మైనింగ్ డీడీ శ్రీనివాసకు మార్, మరో నాలు గు బృందాలకు గూడూరు డివిజన్ మైనింగ్ అధికారి డీవీ రంగకు మార్ నేతృత్వం వహిస్తున్నారు. నెల్లూరు, ఒంగోలు, మార్కాపురం, తిరుపతి, గూడూరు, పలమనేరు, చిత్తూరు, దాచేపల్లి మైనింగ్ శాఖ కార్యాల యాల్లో పనిచేస్తున్న అసిస్టెంట్ జియాలజిస్టులు, సర్వేయర్లు, సూపర్‌వైజర్లు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్లు, టెక్నికల్ అసిస్టెంట్లను విచారణ బృందాల్లో సభ్యులుగా నియమించారు. నెల్లూరు, గూడూరు మైనింగ్ కార్యాలయాల పరిధిలో ఉన్న అన్ని క్వార్ట్జ్, మైకా, ఫెల్డ్‌స్పార్, సిలికా లీజు మైన్లలో తనిఖీలు నిర్వహించాలని, అలానే అనధికారిక తవ్వకాలు జరిగిన ప్రదేశాల్లోనూ తనిఖీలు నిర్వహించి పూర్తిస్థాయి నివేదికలను సమర్పించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఏఆర్ కానిస్టేబుల్ ఆత్మహత్య

● అనారోగ్యం, ఆర్థిక సమస్యలే కారణం



వెంకట సుధీర్ (ఫైల్)

ఏఎస్‌పేట, జూలై 26 : అనారోగ్యం, ఆపై ఆర్థిక సమస్యలతో ఓ ఏఆర్ కానిస్టేబుల్ మృతి చెందిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు... ఏఎస్ పేట మండలం కుప్పురేపాడు గ్రామనికి చెందిన వెంకట సుధీర్ (30) నెల్లూరులోని ఎస్పీ కార్యాలయంలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సుధీర్‌ను ఆర్థిక సమస్యలు వెంటాడాయి. ఈ తరుణంలో బుధవారం కుప్పురేపాడుకు వచ్చిన సుధీర్ గ్రామ సమీపంలోని ఉప్పు కాలువ వద్ద పురుగు మందు తాగాడు. ఆ తర్వాత తన తండ్రి వెంకటేశ్వర్లుకు ఫోన్ చేసి తాను పురుగు మందు తాగిన విషయం తెలపడంతో ఆయన బంధువులతో కలిసి అక్కడకు చేరుకున్నారు. అపస్మారక స్థితిలో ఉన్న సుధీర్‌ను హుటాహుటిన ఆత్మకూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. ఇక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చేందాడు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకోన్నాయి. కాగా, మృతుడు సుధీర్‌కు వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఇసుక డంప్, 2 టిప్పర్లు, ఎక్స్‌కవేటర్ స్వాధీనం

నెల్లూరురూరల్, జూలై 26 : నెల్లూరు రూరల్ పోలీసులు శుక్రవారం రూరల్ ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆకుతోట వద్దనున్న వ్యవసాయ పరిశోధన కేంద్రం (ఏఆర్ఎస్) వెనుక అనధికారికంగా నిల్వ ఉంచిన 80 టన్నుల ఇసుక డంప్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఇసుక తరలింపునకు సిద్ధంగా ఉన్న రెండు టిప్పర్లు, ఒక ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. వీటిపై కేసు నమోదు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక తరలించినా, భారీగా నిల్వ ఉంచిన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పిల్లలు పుట్టేందుకు మందు ఇస్తామని బురిడీ

అల్లూరు, జూలై 26: పిల్లలు పుట్టేందుకు మందులు ఇస్తామని నమ్మబలికి రూ.40వేలు తీసుకెళ్ళిన ఘటన అల్లూరు మండలం ఇస్కపల్లివద్ద శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి తెలిపిన వివరాల మేరకు.. బోగోలు మండలం తాట్టిచెట్లపాలెంకు చెందిన వాయిల శీనయ్య వద్దకు ఇద్దరు వ్యక్తులు వచ్చారు. పిల్లలు లేనివారికి మందుల ద్వారా సంతానం కలిగిస్తామని నమ్మబలికారు. వారి మాటలను పూర్తిస్థాయిలో నమ్మిని శీనయ్య మందుల షాపువద్దకు వస్తే నగదు ఇస్తానని చెప్పాడు. దీంతో వారు తాము అక్కడికే వచ్చి మందులు ఇస్తామని చెప్పారు. శీనయ్య తన అక్క బంగారమ్మతో కలిసి ఒక ద్విచక్రవాహనంలో, ఆ ఇద్దరు మరో ద్విచక్రవాహనంలో అల్లూరువైపు బయలుదేరారు. ఇస్కపల్లి బీఎంఆర్ హేచరీ ఆర్చి వద్దకు వచ్చేసరికి ఆగంతకులు ఇద్దరూ వాహనాన్ని ఆపి బంగారమ్మ వద్ద రూ.40వేల నగదును తమకు ఇవ్వాలని కోరారు. దీనికి ఆమె నిరాకరించడంతో ఆమె వద్దనుండి నగదును బలవంతంగా లాక్కొని శీనయ్యను తోసేసి అక్కడినుండి పరారయ్యారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విష గుళికలు తిని యువకుడి మృతి

వెంకటాచలం, జూలై 26 : మండలంలోని గొలగమూడి గ్రామంలో శుక్రవారం విష గుళికలు తిని యువకుడు మృతి చెందాడు. వివరాల మేరకు గ్రామానికి చెందిన వావిళ్ల శ్రీనివాసులు (28) అనే యువకుడు స్థానికంగా కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే గురువారం బయటకు వెళ్లిన శ్రీనివాసులు అక్కడ విష గుళికలు తిని ఇంటికి వచ్చి వాంతులు చేసుకుంటుండగా కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీనివాసులు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వెంకటాచలం పోలీసులు శుక్రవారం గొలగమూడికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహానికి పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. శ్రీనివాసులుకు భార్య గత నాలుగు నెలల కిందట మృతి చెందగా , వీరికి ఏడాది బాబు ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థి తండ్రిపై ప్రైవేటు పాఠశాల కరస్పాండెంట్ దాడి

అనంతసాగరం, జూలై 26: మండలంలోని ముస్తాపురం క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న లిటిల్ ఎంజెల్స్ పాఠశాల కరస్పాండెట్ పాఠశాలలో చదివే విద్యార్థిని తండ్రి బుజ్జిరెడ్డిపై దాడి చేసి కొట్టిన్నట్లు బాధితుడు శుక్రవారం సోమశిల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తన కుమార్తె పాఠశాలలో ఆరో తరగతి చదువుతుందని, ఫీజు కట్టేందుకు వెళ్లి తన కుమార్తె చదువులో వెనుకంజలో ఉన్నట్లు కరస్పాండెట్‌కు తెలిపానన్నారు. దీంతో కరస్పాండెట్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ టీసీ తీసుకొని వెళ్ల అంటూ దురుసుగా ప్రవర్తించారని, అంతేకాకుండా సిబ్బందితో దాడి చేయించారని బాధితుడు తెలిపాడు. ఈ విషయంపై కరస్పాండెట్ మల్లికార్జున కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు. విద్యార్థిని తండ్రి బుజ్జిరెడ్డి ఫీజు కట్టకుండా కొంత కాలంగా ఇబ్బంది పెట్టడంతో సిబ్బంది ప్రశ్నించారని, కాని తను ఫీజు కట్టేందుకు వచ్చి తనపై దురుసుగా మాట్లాడటంతో పాటు సిబ్బందిపై దాడి చేసినట్లు ఫిర్యాదులో తెలిపారు.

సంగంలో ఆరు ఇళ్లలో చోరీ

● నగదు, నగలు అపహరణ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీఐ రవినాయిక్, ఎస్ఐ నాగార్జున్‌రెడ్డి

సంగం, జూలై 26 : మేజర్ పంచాయతీ సంగంలో గత కొద్ది రోజులుగా దొంగలు రెచ్చిపోతున్నారు. తాళాలు వేసిన ఇళ్లనే టార్గెట్ చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్నారు. తాజాగా గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆరు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. రెండు ఇళ్లలో మాత్రమే రూ. 80 వేల నగదు, రెండు జతల బంగారు కమ్మలు అపహరణకు గురయ్యాయి. మిగతా ఇళ్లలో తాళాలు పగలకొట్టి లోపలకు వెళ్లినా నగలు, నగదు లేకపోవడంతో చోరీ జరగలేదు. వివరాలలోకి వెళ్లితే.. శివాజీ సెంటర్‌లో కాకు రమాదేవికి ఒక వీధిలో ముందు, వెనుక రెండు ఇళ్లు ఉన్నాయి. ఒక ఇంట్లో కుటుంబ సభ్యులు ఉండగా, మరో ఇంట్లో ఎవరూ ఉండరు. ఇంట్లోకి జొరవడిన దుండగులు రెండు జతల కమ్మలు, 60 వేల నగదు చోరీ చేశారు. ఉదయం నిద్ర లేచిన కుటుంబ సభ్యులు ఈ విషయం గుర్తించారు. అదేవిధంగా తిరుమనతిప్ప గురుకుల కళాశాల పక్కన తాళం వేసిన సురేఖ అనే ఇంట్లో మూడు సవర్ల నగలు, రూ.20 వేల నగదు చోరీ అయ్యాయి. అయితే విచారణలో కేవలం నగదు మాత్రమే పోయిందని చెప్పినట్లు పోలీసులు తెలిపారు. అదేవిధంగా కొత్తూరులో ఒకే వీధిలో తాళాలు వేసిన కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, బండి చిన్నయ్య, మరో ఇద్దరిళ్లలో తాళాలు పగలకొట్టి ఇళ్లలోకి ప్రవేశించి గాలించారు. నగలు, నగదు లేకపోవడంతో ఎటువంటి అపహరణ జరగలేదు. సమాచారం అందుకున్న సీఐ రవినాయిక్, ఎస్ఐ నాగార్జునరెడ్డి చోరీ జరిగిన ఇళ్లను పరిశీలించారు. క్లూస్ టీమ్‌కు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి వేలిముద్రలు సేకరించారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● **వరుస చోరీలతో బెంబేలు**

సంగంలో దొంగలు వరుస చోరీలకు పాల్పడుతుండటంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఇంటికి తాళాలు వేసి బయటకు వెళ్లాలంటే భయపడుతున్నారు. ఈ నెల 1వ తేదీ రాత్రి ఐదిళ్లలో దొంగలు చోరీకి పాల్పడి సుమారు 34 గ్రాముల బంగారు నగలు, రెండు లక్షల నగదు అపహరణ చేశారు. చోరీ జరిగిన తరువాత పోలీసులు హడావుడి చేశారు. కానీ ఇంత వరకు అతీగతీ లేదు. మళ్లీ గురువారం రాత్రి ఆరు ఇళ్లల్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. దీంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

సోమశిలలో 9.620 టీఎంసీల నీటి నిల్వ

అనంతసాగరం, జూలై 26: సోమశిల ప్రాజెక్టు పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా శుక్రవారం నాటికి 9.620 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	115
లేయర్ లైవ్	100
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	234
లేయర్	170

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6538
వెండి కిలో ధర	రూ. 83,800
వెండి ఒక గ్రాము	రూ. 85.80

పోలీస్‌స్టేషన్ వద్ద ప్రేమజంట హైడ్రామా

● ట్రాఫిక్‌కు అంతరాయం

కలిగిరి, జూలై 26: స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద శుక్రవారం ఓ ప్రేమజంట హైడ్రామా నడిచింది. వివరాలిలా ఉన్నాయి. కొండాపురం మండలం పార్లపల్లికి చెందిన యువకుడు, కలిగిరి మండలంలోని తూర్పుగుడ్లదొనకు చెందిన యువతి ఇద్దరూ మేజర్లు అంటూ తమకు రక్షణ కల్పించాలంటూ కలిగిరి పోలీస్‌స్టేషన్‌కు శుక్రవారం మధ్యాహ్నం వచ్చారు. ఇరువురూ వేరువేరు సామాజిక వర్గానికి చెందినవారు కావడంతో ఇరువర్గాలకు చెందిన కుటుంబ సభ్యులు, బంధువులు పెద్ద సంఖ్యలో పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకున్నారు. కాగా, స్టేషన్ వద్దనుండి యువతిని వారి కుటుంబ సభ్యులు తీసుకెళ్ళే ప్రయత్నం చేయడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకొంది. దీంతో కాసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఈక్రమంలో స్టేషన్‌లో నుండి సిబ్బంది వచ్చి ఇరువర్గాల వారిని చెదరగొట్టి పంపించివేశారు.

రెండవ ఎంఈవో పోస్టు
కొనసాగింపుపై సందిగ్ధత

గత వైసీపీ ప్రభుత్వం సృష్టించిన ఎంఈవో -2 పోస్టులను రద్దు చేస్తారా!? లేదా కొనసాగిస్తారా!? అనే అంశంపై సందిగ్ధత నెలకొంది. గత ఏడాది అక్టోబరులో ఎంఈవో-2 పోస్టులను సృష్టించి, పంచాయతీ రాజ్ విభాగంలో సీనియర్ ప్రధానోపాధ్యాయులకు అవకాశం కల్పించారు. అయితే, ఎంఈవో -1లా అధికారాలు మాత్రం ఇవ్వలేదు. దీంతో వారు ఏ పనీ చేయడానికి వీల్లేకుండా ఉన్నారు. పోస్టులైనా తీసేయాలని లేదా ఇద్దరికీ సమాన పని కేటాయించాలని ఎంఈవో-2లు డిమాండ్ చేస్తున్నారు.

- ఎంఈవో-1కు పూర్తిస్థాయి అధికారాలు
- ఎంఈవో-2కు నామమాత్రపు విధులు
- సమాన అధికారాల కోసం డిమాండ్
- ఇటీవల మంత్రి లోకేష్‌ను కలిసి విజ్ఞప్తి
- ప్రభుత్వ నిర్ణయంపై నాయకుల్లో ఉత్కంఠ

సంగం, జూలై 26 : గతంలో మండలానికి ఒక్కరే ఎంఈవోగా ఉన్నప్పుడు అన్ని విధులు ఆయన పరిధిలోనే ఉండేవి. అయితే ఎంఈవో-2 ఏర్పాటు తరువాత విధులను పంచారు. అయితే ఇందులో ఒకరికి ఎక్కువ ప్రాధాన్యత, మరొకరికి ఎటువంటి ప్రాధాన్యత లేని విధులు కేటాయించడంతో ఎంఈవో -2లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

● ఎంఈవో-1లకు పాఠశాలలను తనిఖీ చేయడం, టీచర్ల జీత భత్యాలకు సంబంధించిన బిల్లులను మంజూరు చేయడం, టీచర్లకు శిక్షణ తరగతులు నిర్వహించడం, స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించడం, నూతన పాఠశాలలకు గుర్తింపు ఇవ్వడం, పాఠశాలలను అప్‌గ్రేడ్ వివరాలు డీఈవో కార్యాలయానికి పంపడం, టీచర్ల కొరతపై నివేదికలు ఇవ్వడం, టీచర్ల బదిలీలు, సర్వీస్‌మేటర్లను పర్యవేక్షణ చేయడం, టీచర్లకు సెలవులు మంజూరు చేయడం తదితర అంశాలన్నీ ఎంఈవో -1లకు అప్పగించారు.

● ఎంఈవో -2లకు పాఠశాలలను సంసిద్ధత చేయడం, పిల్లల హాజరును పరిశీలించడం, బడిబయట ఉన్న పిల్లలను పాఠశాలల్లో చేర్పించడం, ప్రత్యేక అవసరాలతో కూడిన వృత్తివిద్యను అందించడం, విద్యార్థుల హాజరును నమోదు చేసి, యాడైస్‌కు వివరాలు పంపడం, ఎన్‌సీసీ, సైన్స్ ఎగ్జిబిషన్ల నిర్వమణ వంటి పనులను అప్పగించారు.

● పరిపాలనాపరంగా పూర్తి అధికారాలు ఎంఈవో-1లకు అప్పగించి, ఎంఈవో -2లకు మాత్రం నామమాత్రపు విధులు కేటాయించడం గమనార్హం. దీంతో వీరు అసంతృప్తిగా ఉన్నారు. ఇదేఅదనుగా కొందరు కార్యాలయానికి వచ్చి కూర్చొని వెళ్లిపోతున్నారు. ఎంఈవో -2 పోస్టులను తెరపైకి తెచ్చిన సమయంలో కొందరు విద్యావేత్తలు అభ్యంతరం వ్యక్తం చేసినా పాలకులు పట్టించకోలేదని ఉపాధ్యాయులు అంటున్నారు.



సంగంలోని ఎంఈవో కార్యాలయం

● **సమాన అధికారాల కోసం పట్టు**

మండలస్థాయిలో ఎంఈవో -1, 2 పోస్టులను ఇచ్చిన నేపథ్యంలో ఒక్కో మండలాన్ని రెండుగా విభజించి, అందులోని పాఠశాలలను సమంగా విడగొట్టి ఇద్దరు ఎంఈవోలకు పూర్తిస్థాయి అధికారాలు, విధులు కేటాయించాలని ఉపాధ్యాయ సంఘాలు గతంలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. ఎంఈవో -2 వ్యవస్థను బలోపేతం చేయాలని కూడా నాయకులు కోరారు. ఇద్దరు ఎంఈవోలు ఒకే కార్యాలయంలో పని చేస్తున్నారని, ఎక్కడికి వెళ్లినా ఇద్దరు వెళ్తున్నారని దీనివల్ల ప్రయోజనం ఉండటం లేదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అంతే గాక ఒకరికి పూర్తిస్థాయి అధికారాలు ఇచ్చి, మరో ఎంఈవోకు నామమాత్రపు పనులు చేయమంటున్నారని, దీంతో ఎంఈవో -2లు ఏ పనీ చేయలేక చేష్టలుడిగి చూసే స్థితిలో కొందరున్నారు. ఈ విషయంలో ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు చేసిన సూచనలను గత ప్రభుత్వ పెద్దలు పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎంఈవో -2 పోస్టులను రద్దు చేయాలని లేదా, మండలాన్ని రెం డు భాగాలుగా చేసి ఇరువురికి సమానంగా అధికారాలు కేటాయించాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఇటీవల విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు విన్నవించారు. అయితే ఈ అంశంపై రానున్న రోజుల్లో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశంపై స్పష్టత రాలేదు. త్వరలో ఒక నిర్ణయం తీసుకుంటారని ఉపాధ్యాయులు, ఎంఈవోలు ఎదురు చూస్తున్నారు.

సీనియర్ సహాయకుడి సస్పెషన్

నెల్లూరు(హరనాథపురం) : స్టోన్‌హౌస్‌పేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సీనియర్ సహాయకుడు ఉదయగిరి శ్రీనివాసులును స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ కిరణ్‌కుమార్ శుక్రవారం సస్పెండ్ చేశారు. విధి నిర్వహణలో అలసత్వం, కార్యాలయంలో సరిగా విధులు నిర్వహించకపోవడం, కార్యాలయానికి వచ్చిన ప్రజలతో నిర్లక్ష్యంగా, దురుసుగా ప్రవర్తించడం, ఉన్నతాధికారుల పేరు చెప్పి డబ్బులు వసూలు చేయడం వంటి ఫిర్యాదులు వచ్చాయి. వీటిపై జిల్లా రిజిస్ట్రార్ ద్వారా నివేదిక తెప్పించుకొన్న డీఐజీ విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని నిర్ధారణకు వచ్చి సస్పెండ్ చేశారు.

బావిలో పడి వ్యక్తి మృతి

చంపి పడేశారంటూ కుమార్తె ఫిర్యాదు

మనుబోలు : మండలంలోని లక్ష్మీనరసింహపురం గ్రామంలోని ఉప్పలపాటి వారి బావిలో కుమ్మూరు నరసింహ ప్రసాద్ (47)శుక్రవారం శవమై తేలాడు. తన తండ్రిని కొట్టి చంపి పడేశారంటూ కుమార్తె ఇందుప్రియ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం మేరకు గ్రామానికి చెందిన కే. నరసింహ ప్రసాద్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంతకాలంగా భార్యతో మనస్పర్థలు ఏర్పడి విడిగా నివసిస్తున్నాడు. భార్య, ఇద్దరు బిడ్డలతో నెల్లూరులో ఉంటుండగా, ప్రసాద్ గూడూరులో నివాసం ఉంటున్నాడు. ప్రసాద్ తల్లిదండ్రులు ఇల్లు, పొలాలు అమ్మేసి గుంటూరులో ఉంటున్నారు. ప్రసాద్ ఇతర కుటుంబసభ్యులు ఎల్ఎన్‌పురంలో ఉన్నారు. ప్రసాద్ అప్పుడప్పుడు గ్రామానికి వచ్చి వెళ్తుండేవాడు. ఈ క్రమంలో గురువారం ప్రసాద్ గ్రామానికి వచ్చాడు. తెల్లారేసరికి మోటార్‌సైకిల్ బావి వద్ద ఉండడంతో గ్రామస్తులకు అనుమానం వచ్చి బావిలో చూడగా ప్రసాద్ మృతదేహం తేలాడుతూ ఉంది. బావిలోంచి మృతదేహాన్ని బయటకు తీసి ప్రైవేట్ అంబులెన్సులో గుంటూరులో ఉన్న తల్లిదండ్రుల వద్దకు తరలిస్తుండగా, తండ్రి చనిపోయాడన్న విషయం తెలుసుకున్న కుమార్తె ఇందుప్రియ తల్లితో కలిసి నెల్లూరులో అంబులెన్స్‌ను అడ్డుకుంది. అందులో తండ్రి మృతదేహం చూసి, శరీరంపై గాయాలు ఉండడంతో ఇది ఆత్మహత్య కాదని, తన తండ్రిని ఎవరో కొట్టి చంపి బావిలో పడేశారంటూ ఇందుప్రియ తెలిపింది. దీనిపై మనుబోలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు ఆర్టీసీ నెల్లూరు జోన్ స్పోర్ట్‌మీట్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : ఆర్టీసీ నెల్లూరు జోన్ స్పోర్ట్స్ మీట్-2024 నగరంలోని సుబ్బారెడ్డి స్టేడియంలో శనివారం ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుంది. జోన్ పరిధిలోని నెల్లూరు, ప్రకాశం, నరసరావుపేట, బాపట్ల, గుంటూరు జిల్లాల నుంచి ఆర్టీసీ అధికారులు, సిబ్బంది 80 మందికిపైగా హాజరు కానున్నారు. జోన్ ఈడీ ఆదాము సాహెబ్ ఈ స్పోర్ట్స్‌మీట్‌ను ప్రారంభిస్తారు.

ఉపాధిలో అనకొండలు!

● కలువాయిలో భారీగా అవినీతి, అక్రమాలు ● సోషల్ ఆడిట్‌తో వెలుగులోకి



ఉపాధి సిబ్బందిని విచారిస్తున్న డ్వామా ఏపీడీ విజయలక్ష్మి

కలువాయి, జూలై 26 : మండలంలో ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో కనీవినీ ఎరుగని రీతిలో అక్ర మాలు చోటుచేసు కున్నాయి. మండలం లోని 20 పంచాయతీలో జరిగిన ఉపాధి పనుల్లో రూ.2.89కోట్లు అవకతవకలు జరిగినట్లు సోషల్ ఆడిట్ సిబ్బంది గుర్తించారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు జరిగిన సుమారు రూ.11కోట్లు పనులపై శుక్రవారం మండల పరిషత్తు కార్యాలయం ఆవరణలో సామాజిక తనిఖీల బహిరంగ ప్రజావేదిక నిర్వహించారు. రాష్ట్ర సోషల్ ఆడిట్ డైరెక్టర్ ఎం.జగదీష్‌కుమార్ పర్యవేక్షణలో సోషల్ ఆడిట్ సిబ్బంది పంచాయతీల వారీగా ఉపాధి పనుల్లో చోటుచేసుకున్న అవకతవకలను అధికారులకు తెలియజేశారు. ప్రధానంగా మండలంలోని చిన్నగోపవరంలో జరిగిన అక్రమాలు అధికారులను సైతం ఆశ్చర్యపరి చాయి. ఈ పంచాయతీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతరుల జాబ్‌కార్డులలో గ్రామానికి సంబం ధం లేని 148 మంది పేర్లు ఎక్కించినట్లు ఆడిట్ సిబ్బంది వివరించారు. వీరు ఉపాధి పనులకు వెళ్తున్నట్లు భోగస్ మస్టర్లు వేసి రూ.27.5లక్షలు స్వాహా చేసినట్లు తెలిపారు. దీంతో పాటు పనుల్లో కొలతల తేడా సుమారు రూ.18లక్షలు, మొత్తం రూ.45.37లక్షలు అవినీతి జరిగినట్లు ఆడిట్ సిబ్బంది వెల్లడించారు. జాబ్‌కార్డులో చేర్చిన బయట వ్యక్తుల బ్యాంక్ ఖాతాలు జార్ఖండ్, తెలంగాణాతో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉండటం గమనార్హం. ఈ తరహా అక్రమాలు బయటపడటం రాష్ట్రంలో ఇదే మొదటి సారి అని అధికారులు మాట్లాడుకోవడం విశేషం. చిన్నగోపవరంలో జరిగిన అక్రమాలు రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ దృష్టికి తీసుకుపోతామని అధికారులు తెలిపారు. ప్రధానంగా చింతలపాళెంలో రూ.47లక్షలు, చవటపల్లి రూ.9లక్షలు, కేశమనేనిపల్లి రూ.8లక్షలు, మాదన్నగారిపల్లె రూ.47లక్షలు, ఉయ్యాలపల్లి రూ.24లక్షలు మొత్తం మండలంలో రూ.2.89కోట్లు అవకతకలు జరిగినట్లు తెలిపారు. కార్యక్రమంలో డ్వామా అడిషనల్ పీడీ విజయలక్ష్మి ఏపీడీ శంకర్, అంబుడ్స్ పర్సన్ వెంకటరెడ్డి, సోషల్ ఆడిట్ ఎస్టీఎం కోనయ్య, ఎస్ఆర్‌పీ నీలకంఠ, జడ్పీటీసీ బీ.అనిల్‌కుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ పంగా పెంచలనరసారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి : యూటీఎఫ్

నెల్లూరు(విద్య) : జిల్లాలోని విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ నేతలు కోరారు. ఈ మేరకు శుక్రవారం జేసీ సేధుమాధవ్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. జీఓ నెం 117ను రద్దు చేసి జీఓ నెం 55 ప్రకారం టీచర్లను కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీవీ.శేషులు, చలపతిశర్మ, ఏ.మురళీధర్‌రావు, కార్యదర్శులు సురేంద్రబాబు, నాగిరెడ్డి, ఖాజావలి, నేతలు జమీర్ అహ్మద్, పార్వతీశం తదితరులు పాల్గొన్నారు.

బీర్ ఫ్యాక్టరీ వ్యర్థాల నుంచి కాపాడండి

- కలుషిత నీటిని తాగి చనిపోతున్న జీవాలు, చేపలు
- వ్యాధుల బారిన పడుతున్నాం
- నిరసన తెలిపిన కాకర్లవారిపాళెం గ్రామస్థులు, రైతులు

వెంకటాచలం, జూలై 26 : పరిశ్రమల ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు వచ్చే సంగతేమో కానీ వాటి వల్ల వచ్చే కాలుష్యం వల్ల పర్యావరణం ప్రమాదంలో పడుతున్నది. నీరు, గాలి, నేల కాలుషితమై ప్రజల, మూగజీవాల ప్రాణాలకు పెనుముప్పు వాటిల్లుతున్నది. కాలుష్య నివారణకు ప్రత్యేక యంత్రాంగం ఉన్నా ఆ శాఖ మామూళ్ల మత్తులో జోగుతున్నది. మండలంలోని కాకర్లవారిపాళెం గ్రామస్థులు, రైతులు కాలుష్య కోరల్లో చిక్కి విలవిల్లాడిపోతున్నారు. గ్రామ సమీపంలో ఎస్ఎన్‌జే బీర్ ఫ్యాక్టరీ ఉండగా ఫ్యాక్టరీ ఏర్పాటు చేసే సమయంలో తమ వ్యర్థ జలాలను వదలడానికి 5 ఎకరాల భూమిని కేటాయించి చెరువుగా చేశారు. కొంతకాలం పాటు వ్యర్థ జలాలను అందులో వదిలేవారు. అయితే, ఆ చెరువును పూడ్చి వ్యర్థాలను కాకర్లవారిపాళెం గ్రామానికి సాగునీరందించే కాకర్లగుంట చెరువుకు వదిలేస్తున్నారు. ఫ్యాక్టరీ కార్మికుల నివాసాల నుంచి వచ్చే మురుగుదొడ్ల నీటిని సైతం కాలువలోకి వదిలేస్తున్నారు.



కాలువలోకి వస్తున్న ఫ్యాక్టరీ వ్యర్థాలను చూపుతున్న రైతులు, గ్రామస్థులు

● **మమ్మల్ని కాపాడండి సారూ**

బీర్ ఫ్యాక్టరీ నుంచి కాపాడాలంటూ గ్రామస్థులు రైతులు నిరసన తెలిపి, మీడియా ఎదుట మొరపెట్టుకున్నారు. ఫ్యాక్టరీ వ్యర్థాలు, వేస్టేజ్ కెమికల్ వాటర్, మురికి నీరు తమ చెరువులో కలవడంతో కలుషతమైపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నీరు దుర్వాసన వెదజల్లుతోందని, రంగు కూడా మారిపోయిందన్నారు. కలుషితమైన నీటిని తాగి ఐదేళ్లగా పెద్దఎత్తున మూగజీవాలు చనిపోయాయన్నారు. చేపలు సైతం చనిపోయి నీటిపై తేలాడుతున్నాయన్నారు. అనేక మంది వ్యాధుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై అనేకసార్లు బీర్ ఫ్యాక్టరీ యాజమాన్యం దృష్టికి సమస్యను తీసుకెళ్లిన వారు పట్టించుకోలేదని విమర్శించారు. జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి కలుషితమైన తమ చెరువును బీర్ ఫ్యాక్టరీ నుంచి కాపాడాలని వేడుకున్నారు.

మండల కేంద్రంలోనే పీహెచ్‌సీ వైద్యులు నివాసం ఉండాలి

● డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో పెంచలయ్య

నెల్లూరు(వైద్యం), జూలై 26 : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే వైద్యులు తప్పనిసరిగా మండల కేంద్రాల్లోనే నివాసం ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పత్రికల్లో ఆరోగ్య కేంద్రాలపై ప్రచురించే ప్రతికూల కథనాలపై వెంటనే అధికారులకు రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలని హెచ్చరించారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే అన్న నినాదాన్ని పాటించేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా అవగాహన కల్పించాలన్నారు. మలేరియా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి మాట్లాడుతూ క్షయ నివారణకు 60 ఏళ్ల పైబడిన వారికి అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. డీఐవో డాక్టర్ ఉమామహేశ్వరి మాట్లాడుతూ సకాలంలో గర్భిణులకు, పిల్లలకు వ్యాధినిరోధక టీకాలు వేయాలని సూచించారు. ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుధీర్‌కుమార్ మాట్లాడుతూ పాఠశాలలకు వెళ్లే పిల్లల్లో రక్తహీనత లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. డీపీఎంవో డాక్టర్ రమేష్ మాట్లాడుతూ తాగునీటి వనరుల పరీక్షలలో అలసత్వం తగదన్నారు. మలేరియా నివారణ అధికారి హుస్సేన్ నమ్మ మాట్లాడుతూ లార్వా దశలోనే దోమల నివారణ కార్యక్రమం చేపట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వాసవి, డాక్టర్ నిశ్చల ప్రసాద్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రియంవద, డాక్టర్ భాస్కర్, డెమో శ్రీనివాసులు, డిప్యూటీ డెమో కనక రత్నం, రమేష్ పాల్గొన్నారు.

చేపలు తిని వాంతులు, విరేచనాలు



పాడేరు గ్రామంలో ప్రత్యేక వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్న వైద్యాధికారులు

చేజర్ల, జూలై 26: చేపలకూర తిని వాంతులు, విరోచనాలు అయిన సంఘటన శుక్రవారం మండలంలోని పాడేరు గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల మేరకు ఉన్నట్లుం డి పలువురికి వాంతులు, విరోచనాలు కావడంతో భయభ్రాంతులకు గురైన గ్రామస్తులు అధికారులకు సమాచారం అందజేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డా. మెహబత్ గ్రామా నికి చేరుకుని ప్రత్యేక వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి అస్వస్థతకు గురైన వారికి వైద్యం అందించారు. అలాగే పంచాయితీ కార్యదర్శి పీ.శ్రీనివాసులు గ్రామంలో క్లోరినేషన్ చేయించి పరిశరాలను పరిశుభ్రం చేయించారు. కేవలం ఫుడ్ పాయిజన్ వల్లే ఈ సంఘటన చోటు చేసుకుందని, అనారోగ్యానికి గురైన వారికి ఎటువంటి ఇబ్బంది లేదని పీహెచ్‌సీ వైద్యాధికారి తెలిపారు. అయితే ఆ చేపలు ఎక్కడ కొనుగోలు చేశారన్న విషయాన్ని స్థానికులు గోప్యంగా ఉంచుతున్నారు.

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి



పోలీసు సిబ్బంది సమస్యలు వింటున్న ఎస్పీ

నెల్లూరు(క్రైం), జూలై 26: పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, అందుకోసమే పోలీస్ వెల్ఫేర్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్పీ జీ కృష్ణకాంత్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని ఎస్పీ చాంబర్‌లో శుక్రవారం పోలీస్ వెల్ఫేర్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది సమస్యలను కూలంకుషంగా విని, తగిన పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. ఫిర్యాదులను సంబంధిత డీపీవో అధికారులకు అందజేసి వారితో మాట్లాడి సమస్యలు పరిష్కారించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పోలీసు సంస్కరణల అమలుకు నిదర్శనం

పోలీసు శాఖలో క్షేత్రస్థాయి సిబ్బంది ఆత్మగౌరవానికి పెద్దపీట వేస్తూ గతంలో సీఎం నారాచంద్రబాబు నాయుడు తీసుకువచ్చిన రిట్రీట్-2000 పోలీసు సంస్కరణలకు నిదర్శనంగా శుక్రవారం పోలీసు కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో సిబ్బందిని గౌరవిస్తూ కూర్చోబెట్టి మాట్లాడటమేని ఏపీ స్టేట్ పోలీసు అధికారుల సంఘం నాయకుడు వై శ్రీహరి పేర్కొన్నారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

ఆర్‌అండ్‌బీ స్థలంలో వైసీపీ నేత అక్రమ కట్టడం

● ఉద్రిక్త పరిస్థితుల నడుమ తొలగించిన అధికారులు



ఎక్స్‌కవేటర్‌తో రేకుల షెడ్డును కూల్చేస్తున్న అధికారులు

లింగసముద్రం, జూలై 26: మండల కేంద్రమైన లింగసముద్రం గ్రామంలోని మీసేవా కేంద్రం సమీపంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కనే ఉన్న ఆ శాఖ స్థలంలో ఓ వైసీపీ నాయకుడు రాత్రికి రాత్రే అక్రమంగా నిర్మించిన రేకులషెడ్డు తొలగింపు సందర్భంగా వైసీపీ, టీడీపీ నాయకులు ఘర్షణకు దిగారు. దీంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. వివరాలిలా ఉన్నాయి. ఆర్‌అండ్‌బీ స్థలంలో బస్‌షెల్టర్ నిర్మించాలని టీడీపీ నేతలు ఎంపీడీవో శ్రీనివాసులును కోరారు. ఈ విషయం తెలిసిన వైసీపీ నాయకుడు పరికూటి కృష్ణారెడ్డి గురువారం రాత్రి రేకులషెడ్డు నిర్మించాడు. దీంతో షెడ్డు తొలగించాలని టీడీపీ నేతలు ఎంపీడీఓ శ్రీనివాసులను కోరడంతో శుక్రవారం ఉదయం 11గంటలకు స్థానిక ఎస్సై ఎం బాజీబాబు, పంచాయతీ కార్యదర్శి మాధవరావు, వీఆర్‌ఓ మస్తాన్‌వలీలు రేకుల షెడ్డు వద్దకు సిబ్బందితో వచ్చారు. అలాగే టీడీపీ శ్రేణులు, గ్రామస్థులు కూడా పెద్దఎత్తున అక్కడకు చేరుకున్నారు. అక్కడకు వచ్చిన వైసీపీ నాయకుడు కృష్ణారెడ్డిని ఎలాంటి అనుమతులు లేకుండా రేకులషెడ్డు ఎలా నిర్మించారని పంచాయతీ కార్యదర్శి మాధవరావు అడగ్గా, తన స్వంత స్థలం ముందు ఈస్థలం ఉందని, అందుకే రేకులషెడ్డు నిర్మించానని చెప్పాడు. దీనికి ఎలాంటి అనుమతులు లేవని, వెంటనే తొలగించాలని మాధవరావు చెప్పారు. అయితే ఈ స్థలంలో చాలామంది కట్టడాలు నిర్మించారని, వారందరికీ నోటీసులు ఇచ్చి, తనకు కూడా నోటీసు ఇస్తే తొలగిస్తానని కృష్ణారెడ్డి బదులిచ్చారు. దీంతో ఇది రాత్రికి రాత్రి నిర్మించిన అక్రమ కట్టడం అని, వెంటనే తొలగించాలని టీడీపీ నేతలు జంపాల శివప్రసాద్, అడపా రంగయ్య, గాలంకి ప్రసాద్, అడపా నర్సయ్య, మద్దెల రామారావు, మైల కేశవరావు వాగ్వివాదానికి దిగారు. ఈసందర్భంగా షెడ్డు తొలగించేందుకు కృష్ణారెడ్డికి కొంత సమయమివ్వాలని టీడీపీ నాయకుడు ఉప్పతి బాబురెడ్డి మరికొందరు వైసీపీ నేతలు వారికి నచ్చచెప్పారు. ఈనేపథ్యంలో కృష్ణారెడ్డి, బాబురెడ్డి, టీడీపీ నేతలకు తీవ్ర వాగ్వివాదం జరిగి ఘర్షణకు దారితీసింది. దీంతో ఎస్సై బాజీబాబు, గుడ్లూరు, వలేటివారిపాలెం ఎస్సైలు లక్ష్మణరావు, బాలూ మహేంద్రనాయక్‌లు, సిబ్బంది. ఇరువర్గాలను చెదరగొట్టి దూరంగా పంపించారు. అనంతరం మాధవరావు, వీఆర్‌ఓ మస్తాన్‌వలీలు రేకులషెడ్డును ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేశారు. కందుకూరు డీఎస్పీ ఎ శ్రీనివాసులు సంఘటనా స్థలాన్ని సందర్శించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు.

మంత్రులను కలిసిన మన్నేటి



మంత్రులతో మాట్లాడుతున్న మన్నేటి వెంకటరెడ్డి

ఉదయగిరి రూరల్, జూలై 26: రాష్ట్ర దేవదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి, వైద్యఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్‌యాదవ్‌లను విజయవాడ విమానాశ్రయంలో శుక్రవారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఉదయగిరి నియోజకవర్గ అభివృద్ధికి, ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు సహకరించాలని మంత్రులను కోరినట్లు ఆయన తెలిపారు.

మంత్రిని కలిసిన స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను శుక్రవారం సచివాలయంలో రాష్ట్ర స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలను 50 పడకలకు మార్చినా గైనకాలజిస్టు, పిల్లల వైద్యులతో పాటు అరకొర సిబ్బంది విధులు నిర్వహిస్తున్నట్లు మంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. స్పందించిన మంత్రి పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర స్వచ్ఛంద సంస్థల అధ్యక్షులు పీవీ రమణయ్య, సభ్యులు వీకే ప్రకాష్, సలహాదారు మామిడిపల్లి బాలగంగాధర్, వెంకట శ్రీనివాస్ ఉన్నారు.

సచివాలయాలకు అధినేతల చిత్రపటాల అందజేత

ఉదయగిరి రూరల్, జూలై 26: మండలంలోని శకునాలపల్లి సచివాలయానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ చిత్రపటాలను నాయకులు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో జనసేన, టీడీపీ నాయకులు సురేంద్రరెడ్డి, అలూరి రవీంద్ర, కల్లూరి వెంకటసుబ్బారెడ్డి, కేశవనారాయణ, కేశయ్య, పంచాయతీ, రెవెన్యూ కార్యదర్శులు కరీముల్లా, తేజ, అనూష, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు

117 జీవోను రద్దు చేయాలి: యూటీఎఫ్

వింజమూరు, జూలై 26: యూటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం జీవో నెంబరు 117ను రద్దు చేయాలని కోరుతూ మండల విద్యాశాఖాధికారికి వినతిపత్రం అందజేశారు. అందులో ఉపాధ్యాయ పోస్టులు మంజూరు చేయాలని, ఇతర సమస్యలపై విద్యాశాఖాధికారికి తెలియజేశామన్నారు. కార్యక్రమంలో చెంచలబాబు, వెంకటేశ్వరరెడ్డి, మీరావలి, నాగేశ్వర రావు, వీరాంజనేయులు పాల్గొన్నారు.

ఊటుకూరులో పారిశుధ్య పనులు

వింజమూరు, జూలై 26: మండలంలోని ఊటుకూరు పంచాయతీలో ఇటీవల కురిసిన వర్షాలకు మురుగునీరు నిలిచిన చోట దోమలు ప్రబలకుండా బ్లీచింగ్ చల్లినట్లు, అలాగే తక్కెళ్లపాడు గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టినట్లు సర్పంచ్ వెంగమ్మ తెలిపారు. పంచాయతీ పరిధిలోని నాలుగు గ్రామాల్లో మురుగునీరు నిలిచిన చోట, బోరు, సైడ్ కాలువల వద్ద దోమలు ప్రబలకుండా పారిశుధ్య పనులు చేపట్టినట్లు ఆమె తెలిపారు.

మహిళ మృతిపై విచారణ

అనంతసాగరం : బొమ్మవరంలో పల్లవోలు బుజ్జమ్మ వాంతులు, విరేచనాలతో మృతి చెందినట్లు వచ్చిన ఆరోపణలపై శుక్రవారం అధికారులు విచారణ చేపట్టారు. ఎంపీడీవో తాజ్‌మన్సూర్, పంచాయతీ కార్యదర్శి తిరుపతయ్య కుటుంబ సభ్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అలాగే అనంతసాగరం పీహెచ్‌సీ వైద్యులు శ్రీకాంత్‌రెడ్డి గ్రామానికి చేరుకుని విచారించారు. నివేదికను ఉన్నతాధికారులకు అంద జేస్తామని తెలిపారు.

ఆధార్ కేంద్రం తనిఖీ

ఉదయగిరి రూరల్, జూలై 26: మండలంలోని గండిపాళెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని శుక్రవారం ఎంపీడీవో దేవరకొండ ఈశ్వరమ్మ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో సిబ్బందికి తగు సూచనలు, సలహాలు అందజేశారు. ప్రజలు ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గాజులపల్లి అమర్నాధ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

ఉదయగిరి రూరల్, జూలై 26: మండలంలోని శకునాలపల్లి ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఎంఈవో-2 తోట శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో నిర్వహిస్తున్న శిక్షాసప్తాహ కార్యక్రమాలను పరిశీలించారు. అనంతరం రికార్డులు పరిశీలించి తగు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పీవీ రత్నం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శిక్షా సప్తహ కార్యక్రమం పరిశీలన

కావలిటౌన్, జూలై 26: కావలి పట్టణ జడ్పీ బాలురోన్నత పాఠశాలలో జరుగుతున్న శిక్షా సప్తహ కార్యక్రమాన్ని శుక్రవారం సర్వశిక్షా అభియాన్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఉషారాణి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు అన్నిరంగాల్లో రాణించేవిధంగా కేంద్రప్రభుత్వం వారంరోజుల పాటు పాఠశాలల్లో శిక్షా సప్తహ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ రఘురామయ్య, ఎంఈఓ గోవిందయ్య, ప్రధానోపాధ్యాయిని నీరజ తదితరులు పాల్గొన్నారు.

సర్వే త్వరగా పూర్తి చేయండి: ఎంపీడీవో



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో

సీతారామపురం, జూలై 26: ఓడీఎఫ్ ప్లస్ సర్వే త్వరగా పూర్తి చేయాలని, నిర్లక్ష్యం చేయకుండా వందశాతం పూర్తయ్యేటట్లు చూడాలని సచివాలయ సిబ్బందికి ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ తెలియజేశారు. ఆయన శుక్రవారం సీతారామపురం బిట్-1 సచివాలయాలన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఒకటవ తేది జరిగే పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని ఆరు గంటల నుంచి ప్రారంభించి రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా వేయాలని కోరారు. సిబ్బంది విధిగా సమయపాలన పాటించాలని, అనంతరం పలు రిజిష్టర్లు పరిశీలించి తగు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ జీవన్, డిజిటల్ అసిస్టెంట్ రమేష్ చంద్ర, వెల్ఫేర్ అసిస్టెంట్ వంశీకృష్ణ, ఇంజనీర్ అసిస్టెంట్ సుమతి, మహిళ కార్యదర్శి హాజిరాబేగం, సచివాలయాల సిబ్బంది హాజరయ్యారు.

ప్రజా సమస్యలపై ప్రభుత్వం దృష్టిసారించాలి

ఉదయగిరి రూరల్, జూలై 26: రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ఎన్డీయే ప్రభుత్వం ప్రజా సమస్యలపై దృష్టి సారించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కటారి అజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో వెనుకబడిన మెట్ట ప్రాంతమైన ఉదయగిరి దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. వైద్యశాలలో ఇద్దరు వైద్యులు డిప్యుటేషన్‌పై వెళ్లినా వారి స్థానంలో ఎవరిని ఇంకా నియమించకపోవడంతో రోగులకు మెరుగైన సేవలందడం లేదన్నారు. అంతేకాకుండా రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన పరికరాలు నిరుపయోగంగా ఉన్నాయన్నారు. ఉదయగిరి-నందవరం, ఉదయగిరి-బండగానిపల్లి ఘాట్‌రోడ్డు నిర్మాణాలను పూర్తి చేసి ప్రజల కష్టాలను తీర్చాలని కోరారు. పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్‌ను త్వరితగతిన పూర్తి చేసి ఈ ప్రాంతంలో తాగు, సాగునీటి కష్టాలు తీర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కాకు విజయమ్మ, సీపీఎం నాయకులు కాకు వెంకటయ్య, ఫరుద్దీన్‌బాషా, కామాక్షమ్మ, పందిళ్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి అభివృద్ధిని విస్మరించారు

ఉదయగిరి రూరల్, జూలై 26: వైసీపీ ఐదేళ్ల పాలనలో మేజర్ పంచాయతీ అయిన ఉదయగిరి అభివృద్ధిని పాలకులు, అధికారులు మరిచారని టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షులు షేక్ రియాజ్, పలువురు టీడీపీ నాయకులు అధికారులను ప్రశ్నించారు. శుక్రవారం రైతు సేవా కేంద్రం-1లో ఎంపీడీవో దేవరకొండ ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. వారు మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడ చూసినా పారిశుధ్యం అధ్వానంగా ఉందన్నారు. వీధిదీపాలు వెలిగిన దాఖలాల్లేవన్నారు. మురికి కాలువల్లో పూడిక తీయకపోవడంతో మురుగు రోడ్లపై ప్రవహిస్తూ ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులను కలిగిసుందన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో సిమెంట్‌రోడ్లు, సైడ్ కాలువల నిర్మాణం నాసిరకంగా జరగడంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదన్నారు. గ్రామసభకు సర్పంచ్, పలువురు వార్డుసభ్యులు హాజరుకాకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. అనంతరం ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎంపీడీవో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కరీముల్లా, హెచ్‌ఈ వెంకటసుబ్బయ్య, టీడీపీ నాయకులు బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, సందానీ, సజిల్, అలీజాన్, నరసింహా, బాబు తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహాల్లో మెరుగైన వసతులు కల్పించాలి



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న ఏవీఎస్ నాయకులు

ఆత్మకూరు, జూలై 26: ప్రభుత్వ వసతిగృహాల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని ఆంధ్ర విద్యార్థి సంఘం (ఏవీఎస్) నియోజకవర్గ కన్వీనర్ మహంత్‌రెడ్డి కోరారు. ఈమేరకు శుక్రవారం ఏవీఎస్ నేతలు ఆర్డీవో కే మధులతకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ వసతి గృహాల్లో మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని వసతి గృహాలు శిథిలావస్థకు చేరాయని, మరికొన్ని దశాబ్దాల తరబడి అద్దె గృహాల్లోనే కొనసాగుతున్నాయన్నారు. బీసీ బాలికల వసతి గృహం ప్రహరీగోడ కూలిపోయిందని, మర్రిపాడు, రేవూరులోని వసతి గృహాలు సైతం అధ్వానంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు, అధికారులు స్పందించి వసతిగృహాల్లో మెరుగైన వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏవీఎస్ నాయకులు శ్రీరామ్, ఆదిత్య, పూర్ణేష్, తిరుమల పాల్గొన్నారు.

సెల్ఫ్‌హెల్ప్ గ్రూపుల సిబ్బందికి సన్మానం

వింజమూరు, జూలై 26: వింజమూరులోని వైఎస్సార్ క్రాంతిపథకంలో పనిచేస్తున్న సెల్ఫ్‌హెల్ఫ్ గ్రూపులో సంబంధించిన వీవోఏలు, సీసీలకు, ఏటీఎంకు స్థానిక భారతీయ స్టేట్ బ్యాంకు శాఖ ఆధ్వర్యంలో చిరుసన్మానం చేశారు. ఈ సందర్భంగా బ్యాంకు చీఫ్ మేనేజర్ వై.రామకృష్ణ మాట్లాడుతూ బ్యాంకు అభివృద్ధికి నిరంతరం స్వయం సహాయక బృందాల సభ్యులు పాటుపడుతున్నారని తెలిపారు. అదేవిధంగా మా బ్యాంకు పరిధిలో సెల్ఫ్‌హెల్ప్ గ్రూపులు 350 ఉన్నాయని తెలిపారు. ఈ గ్రూపులన్నింటికి ఒక్కొక్క దానికి సుమారు రూ.20లక్షల మేర రుణాలు ఇస్తున్నామని తెలిపారు. సంఘ సభ్యులు రుణాలను సకాలంలో చెల్లిస్తూ బ్యాంకు అభివృద్ధికి నిరంతరం పాటుపడుతున్నారని అలాంటి వారిని సన్మానించుకోవడం బ్యాంకు అదృష్టమని తెలిపారు. కార్యక్రమంలో గూడూరు చీఫ్ మేనేజర్ వై.బాబురావు, ఫీల్డ్ ఆఫీసర్ మధు, కృష్ణమోహన్, మహేష్, స్థానిక ఏపీఎం సురేష్, ఫీల్డ్ అధికారి మధు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్లపై అప్రమత్తత అవసరం



చెట్లను పరిశీలిస్తున్న జయశ్రీ

ఉదయగిరి రూరల్, జూలై 26: పండ్లతోటలకు సోకే తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఉద్యానవన శాఖాధికారి జయశ్రీ సూచించారు. శుక్రవారం ఉదయగిరితో పాటు దుత్తలూరు మండలంలోని సోమరేగడ, వెంకటంపేట గ్రామాల్లో బత్తాయి, మామిడి, డ్రాగన్‌ఫ్రూట్ తోటలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ వేరుకుళ్ల తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వీహెచ్ ఏ భరత్, రైతులు పాల్గొన్నారు.

మినుము పంట పరిశీలన

నేలటూరులో సాగులో ఉన్న మినుము పంటలను వ్యవసాయ సహాయ సంచాలకులు చెన్నారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మినుము పంటలో తెగులు నివారణకు లీటర్ నీటికి 0.5 గ్రాముల అసటామ్రాఫైడ్‌ను పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఆంజనేయులనాయక్, ఏఈవో వీపీఏ స్రవంతి పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్ శిబిరాల తనిఖీ

సీతారామపురం, జూలై 26: మండల పరిధిలోని సీతారామపురం, పబ్బులేటిపల్లి సచివాలయాల్లో నిర్వహించిన ప్రత్యేక ఆధార్ క్యాంపులను ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ శుక్రవారం తనిఖీ చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఆధార్ తీసుకుని పదేళ్లు దాటిన వారికి అప్‌డేట్ చేయడంతో పాటు పేర్ల చేర్పులు మార్పులు చేయడం జరుగుతుందని తెలిపారు.

కార్గిల్ విజయ్ దివస్ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ సైనికులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు

కావలి, జూలై 26: వివిధ రేజిమెంట్లకు చెందిన 587 మంది సైనికుల ప్రాణత్యాగంతో కార్గిల్ యుద్ధంలో భారత్‌కు విజయం లభించిందని కార్గిల్ యుద్ధవీరుడు మారుబోయిన యానాది తెలిపారు. కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా మాజీ సైనికుల ఆధ్వర్యంలో శుక్రవారం కావలిలో సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు బీవీ రాజారావు అధ్యక్షతన జరిగిన ఈ ర్యాలీ స్థానిక బీపీఎస్ సెంటర్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు సాగింది. ఈ ర్యాలీలో అఖిలభారతీయ పూర్వ సైనిక సేవాపరిషత్, రెడ్‌క్రాస్, రోటరీక్లబ్ తదితర సంస్థల ప్రతినిధులు సంఘీభావంగా పాల్గొన్నారు. కార్గిల్ యుద్ధంలో గాయపడిన సైనికుడు మారుబోయిన యానాదిని ఈ సందర్భంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ తాను కార్గిల్ యుద్ధంలో గాయపడి నెల రోజులు కోమాలో ఉన్నానని తెలిపారు. ఉగ్రవాదుల ముసుగులో పాకిస్థాన్ సైనికులు కార్గిల్ శిఖరాలపైకి చేరి బంకర్లు ఏర్పాటు చేసుకుని ఉన్నా అత్యంత సాహసంతో మన సైనికులు వారిని తరిమికొట్టడం జరిగిందన్నారు. అనంతరం జూలై 26న టైగర్‌హిల్స్‌పై మన జాతీయపతాకాన్ని ఎగురవేయటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వసైనిక సేవాపరిషత్ కావలిశాఖ కన్వీనర్ డీ రవిప్రకాష్, జమున, రెడ్‌క్రాస్ రక్తకేంద్రం సిబ్బంది, రోటరీక్లబ్ ప్రతినిధులు స్వర్ణలత, సలీమ్‌బేగ్, గోపీక్రిష్ణ మాజీ సైనికులు, కోటేశ్వరరావు, సురేంద్రకుమార్, రహీమ్,బాషా, జాన్, శ్రీనివాసులు, సాలోమన్ పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ పనుల తనిఖీ



అన్న క్యాంటీన్ పనులను పరిశీలిస్తున్న ఆర్డీవో

కావలి, జూలై 26: కావలి ఆర్డీవో శీనానాయక్ మున్సిపల్ అధికారులతో కలిసి శుక్రవారం కావలి పట్టణంలో పలుచోట్ల తనిఖీలు చేశారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉన్న అన్న క్యాంటీన్ మరమ్మతుల పనులను పరిశీలించి పనులు వేగవంతం చేయాలని చెప్పారు. ఆగస్టు 15వ తేదీన అన్నా క్యాంటీన్‌లను రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభిస్తున్న సందర్భంగా త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. అనంతరం దాని పక్కనే గతంలో అమృత్ సైలాన్‌ను ధ్వంసం చేసిన స్థలంలో జాతీయ జండా ఐకాన్ నిర్మాణాన్ని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి సొంత నిధులతో చేయిస్తుండగా పరిశీలించారు. అనంతరం రైతుబజారులను పరిశీలించారు. అక్కడ పారిశుధ్యం నిర్వహణను పరిశీలించారు. పట్టణంలో పలుచోట్ల కేబుల్ వైర్లు వేలాడుతుండటంతో వాటి నిర్వాహకులను పిలిపించి సరిచేయించాలని, వారు సరి చేయకపోతే ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్న వైర్లను తొలగించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మున్సిపల్ డీఈ సాయిరాం, పట్టణ ప్రణాళికాధికారి బాబూరావు పాల్గొన్నారు.

డ్రైనేజీ పూడికతీత పనుల పరిశీలన

కావలి, జూలై 26: రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని కావలి పట్టణంలో డ్రైనేజీ పూడికతీత పనులను కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు చేపట్టారు. పట్టణంలో ట్రంకు రోడ్డు, సినిమాహాల్ రోడ్డులలో జరుగుతున్న పనులను శుక్రవారం కావలి మున్సిపల్ కమిషనర్ జీ శ్రావణ్‌కుమార్ పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. అలాగే తీసిన పూడికను అక్కడ నుంచి వెంటనే తరలించేలా చర్యలు చేపట్టాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావుకు చెప్పారు. ఈ కార్యక్రమంలో శానిటరీ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తప్పని సరిగా హెల్మెట్ ధరించాలి

ఆత్మకూరు, జూలై 26 : ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెంట్ ధరించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీరాములు తెలిపారు. శుక్రవారం ఆయన పట్టణంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. హెల్మెట్ ధరించడం వలన ఉపయోగాలను వాహనదారులకు అవగాహన కల్పించారు. వాహనాలు నడిపేటప్పుడు పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు.

●**అల్లూరు:** అల్లూరు పట్టణంలో శుక్రవారం నెల్లూరు ఆర్టీఓ పూర్ణచంద్రరావు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు ద్విచక్రవాహనాలకు పత్రాలు లేని కారణంగా సీజ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. సరైన పత్రాలు లేని మిగిలిన వాహనాలకు అపరాధ రుసుము విధించినట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలతోపాటు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. ఈ కార్య క్రమంలో అల్లూరు ఎస్‌ఐ శ్రీనివాసులురెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పైపులైన్ లీకేజీ సమస్య పరిష్కరించాలి

గుడ్లూరు, జూలై 26 : మండల కేంద్రమైన గుడ్లూరు రెడ్డిపాలెం పాత రైస్‌మిల్ వీధిలో ఏర్పడిన పంచాయతీ పైపులైన్ లీకేజీ సమస్య పరిష్కరించి కుళాయి నీరు అందించాలని ఆ ప్రాంత కాలనీకి చెందిన పలువురు మహిళలు శుక్రవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెడ్డిపాలెం పాతరైస్ మిల్లు వీధికి పక్కగా నూతన ఇంటి నిర్మాణాలు చేస్తున్న కొందరు తమ ఇంటికి అడ్డుగా ఉందనే కారణంచేత, రహదారికి పక్కగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని ముందుకు జరిపి, పైప్‌లైన్ ఉన్న ప్రాంతంలో ఏర్పాటు చేయించడంతో కుళాయి పైప్‌లైన్ దెబ్బతిందని దీంతో నీటి సరఫరాను అధికారులు నిలుపుదల చేయడంతో గత వారం రోజుల నుంచి తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇప్పటికైన మండల స్థాయి విద్యుత్, పంచాయతీ, మండల పరిషత్ అధికారులు వెంటనే స్పందించి పైప్‌లైన్ మరమ్మతులు వెంటనే చేయించాలని, అలాగే రహదారికి అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని కూడా తొలగించి, పాత స్థానంలోనే ఏర్పాటు చేయాలని స్థానికులు అధికారులను కోరారు.

బిచ్చగాని వద్ద రూ.1.50 లక్షలు దోచుకున్న దొంగలు

లింగసముద్రం, జూలై 26: మండలంలోని తిమ్మారెడ్డిపాలెం గ్రామానికి చెందిన శాగం రాగయ్య అనే బిచ్చగాని వద్ద దొంగలు రూ.1.50 లక్షలు దోచుకున్నారు. గ్రామానికి చెందిన ఆయన బంధువులు కొందరు ఈ సంఘటనపై రాగయ్య చేత మూడు రోజుల క్రితం లింగసముద్రం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయించారు. వారు అందించిన సమాచారం మేరకు 5 రోజుల క్రితం రాగయ్య గ్రామ సమీపంలోని వీరబ్రహ్మేంద్రస్వామి గుడి వద్ద రాత్రి ఒక్కడే నిద్రిస్తుండగా దొంగలు అతని వద్ద నగదును తీసుకొని కొట్టి పరారయ్యారు. ఈ సంఘ టనలో నలుగురు వ్యక్తులు పాల్గొన్నట్టు వారు అను మానాలు వ్యక్తం చేస్తూ, వారి పేర్లు కూడా పోలీసులకు చెప్పినట్టు తెలిపారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

జనసేన పార్టీ సభ్యత్వ నమోదు

అల్లూరు, జూలై 26: జనసేన పార్టీ బలోపేతం కావాలంటే క్రియాశీలక సభ్యత్వం కీలకమని ఆ పార్టీ కావలి ఇన్‌చార్జి అలహరి సుధాకర్ అన్నారు. అల్లూరులో శుక్రవారం క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణే లక్ష్యం : డీటీసీ



ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న డీటీసీ.

కావలి రూరల్, జూలై 26: పర్యావరణ పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యం అని డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ బి చందర్ పేర్కొన్నారు. కావలి మండలం రుద్రకోటలోని ఆర్డీవో కార్యాలయంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఆర్డీవో వై సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డీటీసీ చందర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరు మొక్కులు నాటే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అనంతరం కార్యాలయ ప్రాంగణంలో డీటీసీ చేతుల మీదుగా 30 రకాల పండ్ల మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కావలి ఆర్టీవో కార్యాలయ ఇన్‌స్పెక్టర్లు సుందర్‌రావు, కరుణాకర్, లక్ష్మీబాయ్, కందుకూరు ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ రఫి, నెల్లూరు ఇన్‌స్పెక్టర్ లు మురళిమోహన్, బాలమురళీక్రిష్ణ, రాంబాబు, గోపీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

టీఆర్ఆర్‌లో ముగిసిన జాతీయస్థాయి సెమినార్

కందుకూరు, జూలై 26: స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండురోజుల పాటు నిర్వహించిన జాతీయ సెమినార్ శుక్రవారం సాయంత్రం ముగిసింది. భారతదేశంలో ఆర్థిక సేవలు - అవకాశాలు, సమస్యలు మరియు సవాళ్లు అనే అంశంపై నిర్వహించిన ఈ సెమినార్‌లో దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాల అర్థశాస్త్ర ప్రొఫెసర్లు హాజరై దేశ ఆర్థిక పురోగమనం, అన్నివర్గాలు ప్రాంతాల ఆర్థికాభివృద్ధికి దోహదపడే అంశాలపై తమ పరిశోధనా పత్రాలను సమర్పించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ అర్థశాస్త్ర ప్రొఫెసర్ అలోక్‌కుమార్ మిశ్రా మాట్లాడుతూ సెమినార్‌లో జరిగిన చర్చల సారాంశం దేశ ఆర్థికాభివృద్ధికి ఎంతోకొంత దోహదపడుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం రవికుమార్ అధ్యక్షతన జరిగిన సెమినార్ ముగింపు కార్యక్రమంలో కో ఆర్డినేటరు డాక్టరు ఏడుకొండలు నరేంద్ర, వివిధ యూనివర్సిటీల ప్రొఫెసర్లు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

జేబీ డిగ్రీ కళాశాలను సందర్శించిన వీసీయు వీసీ



ఇండోర్ స్టేడియంను పరిశీలిస్తున్న వీసీయు వీసీ

కావలిటౌన్, జూలై 26: జవహర్ భారతీ డిగ్రీ కళాశాలను శుక్రవారం విక్రమ సింహపురి యూనివర్శిటీ ఉపకులపతి ఆచార్య విజయ భాస్కర్‌రావు సందర్శించారు. కళా శాల ప్రాంగణంలోని క్రీడామైదానం, ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్‌పూల్, గార్డెన్ సందర్శించారు. ఆయన మాట్లా డుతూ విశ్వోదయ వ్యవస్థాపకుడు దొడ్ల రామచంద్రారెడ్డి అంకితభావంతో చేసిన కృషి ఫలితమే విశ్వోదయా విద్యాసంస్థలని నాటి వైభవం తలచుకున్నారు. విశ్వోదయకు పూర్వ వైభవం కల్పించేందుకు కృషిచేయాలని, అందుకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందితో విద్యాపరమైన అంశాలపై సమీక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్రమణ్యంనాయుడు, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల డైరెక్టర్ ఆర్ మాల్యాద్రి, అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

రాక్షస పాలనకు ప్రజలు చరమగీతం పాడారు : వంటేరు

జలదంకి, జూలై 26: ఐదేళ్ళ జగన్ రాక్షస పాలనకు ప్రజలు చరమగీతం పాడారని కావలి మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర నాయకుడు వంటేరు వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జలదంకి మండలం బ్రాహ్మణక్రాకలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 40రోజుల చంద్రబాబు పాలన చూసి ప్రజలు ఆనందంగా ఉంటే జగన్‌కు మతిభ్రమించి ఢిల్లీ వెళ్ళి ధర్నా చేయడం చూస్తే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందన్నారు. ఈ సమావేశంలో బ్రాహ్మణక్రాక సర్పంచ్, ఉపసర్పంచ్‌లు ఇండ్ల సుదాకర్, దగుమాటి మాల్యాద్రిరెడ్డి, టీడీపీ మండల నాయకుడు చేవూరి జనార్దన్‌రెడ్డి, బీజేపీ నేత మారెళ్ళ బ్రహ్మారెడ్డిలు పాల్గొన్నారు. అనంతరం ప్రధాని మోదీ, సిఎం, డిప్యూటీ సిఎంలు చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్, ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ల చిత్రపటాలను బ్రాహ్మణక్రాక, బి.కె అగ్రహారం గ్రామసచివాలయాల్లో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆయా సచివాలయాల సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి నీరజ పాల్గొన్నారు.

కష్టపడి చదవాలి : ఎస్సై

ఉలవపాడు, జూలై 26: విద్యార్థి దశలోనే సరైన లక్ష్యాలను ఎంచుకొని కష్టపడి చదవాలని ఎస్సై బాజీరెడ్డి సూచించారు. ఉలవపాడు జూనియర్ కళాశాలలో శుక్రవారం కెరీర్ గైడెన్స్‌లో భాగంగా విద్యార్థులకు అవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్సై బాజీరెడ్డి విద్యార్థులకు పలు సూచనలు అందించారు. సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ గారపాటి గోపీచంద్ ప్రకాష్, కెరీర్ గైడెన్స్ కోఆర్డినేటర్ మహ్మద్ రఫీ, లైబ్రరీ అధ్యాపకులు హనుమంతరావు పాలొన్నారు. కళాశాల సిబ్బంది ఎస్సై బాజీరెడ్డిని సత్కరించారు.

టీడీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు ఎత్తివేయాలి



పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న మోషే

కందుకూరు, జూలై 26: గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని తెలుగుదేశం పార్టీ కార్యకర్తలపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని టీడీపీ నెల్లూరు పార్లమెంటు అధికార ప్రతినిధి గోచిపాతల మోషే కోరారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును శుక్రవారం విజయవాడలోని పార్టీ కార్యాలయంలో కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి తగుచర్యలు తీసుకోవటం జరుగుతుందని ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు హామీ ఇచ్చారని తెలిపారు. ఆయనవెంట ఎస్సీ సెల్ నాయకులు గోన ప్రతాప్‌కుమార్ తదితరులున్నారు.

తమిళనాడు బోట్లను అడ్డుకోవాలి

● రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్‌కు మంత్రి కొల్లు ఆదేశం


కావలి, జూలై 26: తమిళనాడు నుంచి నెల్లూరు జిల్లా తీరప్రాంతాలకు వచ్చి వేటాడుతున్న బోట్లను తక్షణం అడ్డుకోవాలని రాష్ట్ర గనులు, భూగర్భ, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్‌ను ఆదేశించారు. అమరావతిలోని సచివాలయంలో శుక్రవారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి మంత్రిని కలిసి కావలి, కోవూరు, సర్వేపల్లి నియోజకవర్గాల పరిధిలో తమిళబోట్లు వచ్చి వేట సాగిస్తున్నందున స్థానిక మత్స్యకారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, దాని వలన వారికి కలుగు నష్టాలను గురించి వివరించారు. తమిళనాడు నుంచి పెద్దపెద్ద బోట్లు మన తీరంలోకి వచ్చి స్థానిక మత్స్యకారుల వలలను నాశనం చేస్తూ మత్స్యకార వృత్తిని దెబ్బతీస్తున్నారని చెప్పారు. దీనిపై స్పందించిన మంత్రి తమిళ బోట్లు ఈప్రాంతాలకు రాకుండా తక్షణమే తగు చర్యలు తీసుకుని మత్స్యకారులు నష్టపోకుండా చూడాలని ఫిషరీస్ కమిషనర్‌ను ఆదేశించారు.

డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయండి : ఎమ్మెల్యే కాకర్ల

వింజమూరు/ఉదయగిరి రూరల్, జూలై 26 : ఉదయగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శుక్రవారం అసెంబ్లీలో నియోజకవర్గంలోని సమస్యలపై మాట్లాడుతూ సాగు, తాగునీటితో పాటు డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. మెట్ట ప్రాంతం కావడంతో విశాలమైన భూభాగం ఉన్నప్పటికీ సాగునీరు లేక పొలాలు బీడు భూములుగా మారుతున్నాయన్నారు. సాగునీరు అందిస్తే వేలాది ఎకరాలు బంజరు భూములుగా మారుతాయని తెలిపారు. ఉదయగిరి, వింజమూరు ప్రభుత్వ వైద్యశాలలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కి వినతిపత్రం అందజేశారు. అలాగే మెట్ట వాసులకు ఆరోగ్య భద్రత కల్పించాలని ఎమ్మెల్యే కోరారు.

నామినేటెడ్ పదవులకు సంబంధించిన 60:40 ఫార్ములా తిరుపతిలో కూటమి నేతలను కలవరపరుస్తోంది. ఈ ఫార్ములా వల్ల నియోజకవర్గంలో బలంగా ఉన్న టీడీపీ నాయకులు తమకు నష్టం జరుగుతుందని ఆందోళన చెందుతున్నారు. జనసేన నేతల్లో సంబరం ఉన్నా, తమలో పదవులు దక్కేది ఎవరికనే కలవరం వారిలోనూ ఉంది. బీజేపీ కూడా తమ వాటా పంచుకోవడానికి సిద్ధంగా ఉంది. పరిమిత సంఖ్యలో ఉన్న నామినేటెడ్ పదవుల పందేరం మొత్తంమీద తిరుపతి నియోజకవర్గంలో కత్తిమీద సాముగా మారే అవకాశం కనిపిస్తోంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



60:40 ఫార్ములాతో ఆశావహుల గుండెల్లో గుబులు

నామినేటెడ్ పదవులు ఎవరికి?

తుడ, టీటీడీ బోర్డు మెంబరు పదవులపై పెరుగుతున్న ఆశలు

స్టేట్ కోటాపై ఆశలు

అయితే తిరుపతి టీడీపీలో పలువురు ముఖ్య నాయుల వాదన భిన్నంగా ఉంది. సుగుణమ్మ, నరసింహ యాదవ్, కోడూరు బాలసుబ్రమణ్యం, శ్రీధర్ వర్మ వంటి వారు తమకు పార్టీ స్టేట్ కోటాలో నామినేటెడ్ పదవులు కేటాయిస్తుందని ఆశిస్తున్నారు. సుగుణమ్మ, నరసింహ యాదవ్‌లకు తిరుపతిలో పదవులు కేటాయించలేని పక్షంలో ఎమ్మెల్సీ లేదా రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులు ఇచ్చే అవకాశముంది.నారా లోకేశ్ సిఫారసు దక్కుతుందనే ఆశతో కోడూరు బాలసుబ్రమణ్యం ఉండగా, ఎన్టీయార్ కుటుంబసభ్యులను నమ్ముకుని శ్రీధర్ వర్మ వున్నారు. సున్నితమైన ఈ వ్యవహారాన్ని అధిష్ఠానం ఎలా అధిగమిస్తుందో వేచి చూడాల్సి వుంది.

జనసేనలో ఛాన్సు కొట్టేదెవరు?

జిల్లాలో జనసేన ఉనికి ప్రధానంగా తిరుపతిలోనే కనిపిస్తుంది. జిల్లా పార్టీ అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్, నియోజకవర్గ ఇంఛార్జి కిరణ్ రాయల్, నగర అధ్యక్షుడు రాజారెడ్డి..ఈ ముగ్గురే పార్టీలో చెప్పుకోదగిన నాయకులు. వీరిలో కిరణ్ రాయల్ తరచూ కార్యక్రమాలు,ప్రెస్ మీట్లు, మీడియా డిబేట్లలో పాల్గొంటూ పార్టీ ఉనికిని చాటుతున్నారు. ఆ క్రమంలో తరచూ తమ అధినేత పవన్ కళ్యాణ్‌పై నోరు పారేసుకునే మాజీ మంత్రి రోజాతో గత వైసీపీ ప్రభుత్వంలో పోరాడి క్రిమినల్ కేసులు, పోలీసు వేధింపులు కూడా ఎదుర్కొన్నారు. ఆ కారణంగా తనకు ప్రాముఖ్యత కలిగిన నామినేటెడ్ పదవి కేటాయిస్తారని ఆయన అధిష్ఠానంపై నమ్మకం పెట్టుకున్నారు. అయితే తిరుపతి ఎమ్మెల్యే సిఫారసు ప్రామాణికమైతే మాత్రం ఈయనకు పదవి అనుమానమే అంటున్నారు. మొత్తం మీద వీరిలో కనీసం ఇద్దరికి పదవులు దక్కే అవకాశం ఉంది.

బీజేపీకి ఒక పదవి గ్యారంటీ

తిరుపతిలో వున్న బీజేపీ నేతల్లో భానుప్రకాష్‌రెడ్డి, సామంచి శ్రీనివాస్ చురుగ్గా వుంటూ కార్యకలాపాలు సాగిస్తున్నారు. గత ప్రభుత్వ తప్పిదాలపై వీరు తరచూ గళం విప్పి పార్టీ ఉనికి చాటారు. ఎన్నికల సమయంలో నవీన్‌కుమార్‌రెడ్డి కూడా బీజేపీలో చేరారు. భానుప్రకాష్‌రెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి ప్రజా ప్రయోజనాల కోసం అనేక సందర్భాల్లో న్యాయపోరాటాలు కూడా చేశారు.ఈ ముగ్గురూ నామినేటెడ్ పదవులు ఆశిస్తున్నారు. 60-40 నిష్పత్తి ఫార్ములాతో బీజేపీకి ఒక పదవి దక్కవచ్చు. అయితే అది ఏ పదవి, దాన్ని ఎవరు దక్కించుకుంటారనేది వేచి చూడాల్సి వుంది.

టీడీపీ నేతల్లో ఆందోళన

తిరుపతి నియోజకవర్గంలో జనసేన, బీజేపీతో పోలిస్తే టీడీపీకి బలమైన పార్టీ కేడర్‌తో పాటూ చెప్పుకోదగిన నాయకత్వం వుంది. దీంతో నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న వారూ ఆ పార్టీలో ఎక్కువే. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, జిల్లా పార్టీ అధ్యక్షుడు నరసింహ యాదవ్ మొదలుకుని రాష్ట్ర మీడియా కో ఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, రాష్ట్ర అధికార ప్రతినిధి కోడూరు బాలసుబ్రమణ్యం, ముఖ్య నాయకులు మబ్బు దేవనారాయణరెడ్డి, ఊకా విజయ్‌కుమార్, ఆర్సీ మునికృష్ణ, జేబీ శ్రీనివాస్, పులిగోరు మురళీకృష్ణారెడ్డి, పుష్పావతి వంటి వారున్నారు. తిరుపతి సీటు టీడీపీదని, తమ త్యాగం వల్లే మిత్రపక్షమైన జనసేనకు కేటాయించారన్న బలమైన అభిప్రాయం వీరిలో వ్యక్తమవుతోంది. ఇందుకు ప్రతిగా ప్రాముఖ్యత కలిగిన నామినేటెడ్ పదవులు ఇవ్వాలని వారు ఆశపడుతున్నారు. అయితే కూటమి పార్టీల ఫార్ములా ప్రకారం ఇక్కడ 60 శాతం పదవులు జనసేనకూ, మిగిలిన 40 శాతం పదవులు టీడీపీ, బీజేపీలకు కేటాయించేట్లయితే తమ పరిస్థితి ఏమిటా అని టీడీపీ ఆశావహులు డీలా పడిపోతున్నారు.

తిరుపతిలో ఉన్న పదవులు ఇవే!

తిరుపతి నియోజకవర్గంలో వున్న నామినేటెడ్ పదవులు చాలా పరిమితం. తుడా ఛైర్మన్, స్మార్ట్ సిటీ కార్పొరేషన్ ఛైర్మన్, టీటీడీ బోర్డు మెంబరు పదవులు మాత్రమే వున్నాయి. టీటీడీ బోర్డులో తుడ ఛైర్మన్ ఎక్స్‌అఫిషియో మెంబరుగా ఉంటారు కాబట్టి మహా అయితే మరొకరికి మాత్రమే అవకాశం ఉంటుంది. ఇతర నియోజకవర్గాల తరహాలో ఇక్కడ మార్కెట్ కమిటీలు లేవు. తాతయ్యగుంట గంగమ్మ ఆలయం మినహా ప్రాధాన్యత కలిగిన దేవదాయ శాఖ ఆలయాలూ లేవు. గంగమ్మ గుడి ట్రస్టు బోర్డు పదవి ద్వితీయ శ్రేణి నేతలకు కేటాయించే పదవి. ఈ నాలుగు పదవులనూ పరిగణనలోకి తీసుకున్నా 60 శాతం అంటే రెండు లేదా మూడు పదవులు జనసేన పార్టీకే దక్కుతాయి. ఇక ఒకటి లేదా రెండు పదవుల్ని బీజేపీతో కలసి టీడీపీ పంచుకోవాల్సి వుంటుంది. టీడీపీకి దక్కితే ఒక పదవి లేదంటే అది కూడా లేదు. తిరుపతి టీడీపీ వర్గీయులను ఈ చేదు వాస్తవం ఇబ్బంది పెడుతోంది.



ఘటనాస్థలిని పరిశీలిస్తున్న డీఈవో రామారావు

స్కూల్లో కుప్పకూలిన సన్‌షేడ్



గురుమహేంద్ర (ఫైల్ ఫొటో)

- నైన్త్ విద్యార్థి దుర్మరణం

నెల్లూరు (విద్య/క్రైం), జూలై 26 : నెల్లూరులోని కేఎస్ఆర్ పాఠశాలలో శుక్రవారం సాయంత్రం నిర్మాణంలో ఉన్న భవనం గోడ కూలి కిందపడడంతో ఓ విద్యార్థి దుర్మరణం పాలయ్యాడు.వెంకటగిరి ప్రాంతానికి చెందిన కొత్తపాలెం గురవయ్య, రూప దంపతులకు ఇద్దరు కుమారులు. బిడ్డల చదువుల కోసం వీరు నెల్లూరుకు వలసొచ్చారు.ఇస్కాన్ సిటీలోని ఓ అపార్ట్‌మెంట్‌లో గురవయ్య వాచ్‌మన్‌గా పని చేస్తుండగా, రూప కూలి పనులకు వెళుతోంది. వీరి చిన్న కుమారుడు గురుమహేంద్ర (14) కేఎస్ఆర్ నగరపాలక సంస్థ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు.శుక్రవారం ఉదయం పాఠశాలకు వెళ్లిన మహేంద్ర సాయంత్రం లాంగ్‌బెల్ తర్వాత నిర్మాణంలో ఉన్న నాడు-నేడు రెండవ దశ అదనపు తరగతి గదుల మొండి గోడల వద్దకు వెళ్లి గోడపైన ఉన్న లింటల్‌ను పట్టుకొని ఆడుకుంటున్న సమయంలో లింటల్, దాని మీద ఉన్న గోడ విరిగి గురుమహేంద్రపై పడ్డాయి.గమనించిన తోటి విద్యార్థులు అక్కడే ఉన్న ఉపాధ్యాయులకు తెలిపారు. హుటాహుటిన వారు గోడ కింద ఉన్న విద్యార్థిని బయటకు తీశారు. గోడ బలంగా గురుమహేంద్ర తలపై పడటంతో తల పగిలి అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు.ప్రధానోపాధ్యాయుడు ఎం.విజయ ప్రకాష్ వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో డీఎస్పీ శ్రీనివాసులరెడ్డితోపాటు సీఐ నారాయణ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. జీజీహెచ్‌లో పోస్టుమార్టం అనంతరం విద్యార్థి మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు. వందల మంది విద్యార్థులకు ఇద్దరే ఉపాధ్యాయులు ఉండటంతో విద్యార్థులను అదుపు చేయడం కష్టంగా మారుతోందని, అందుకే ప్రమాదం జరిగిందని పాఠశాల హెచ్‌ఎం పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ సంఘటనతో కేఎస్ఆర్ నగరపాలక ప్రాథమిక పాఠశాలలో నాడు-నేడు కింద జరిగిన భవన నిర్మాణ పనుల్లో డొల్లతనం బయటపడింది. పనులు నాసిరకంగా జరగడంతో లింటల్ లెవల్ సన్‌షేడ్ శుక్రవారం కూలిపోయింది. కాంక్రీట్ బీమ్స్‌లో నుంచి ఇనుపచువ్వలు సైతం బయటకు పొడుచుకుని వచ్చాయి.చనిపోయిన విద్యార్థి గురుమహేంద్ర కుటుంబ సభ్యులకు ప్రభుత్వం తరఫున అండగా నిలుస్తామని, రూ.5లక్షల పరిహారం అందచేస్తామని మంత్రి నారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి చెక్కును అందజేస్తామని తెలిపారు. కేఎస్ఆర్ పాఠశాలలో జరిగిన ప్రమాద ఘటనకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ది పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ నేతలు డిమాండ్ చేశారు.

కొబ్బరికాయల వ్యాపారి కిడ్నాప్ సుఖాంతం

పోలీసుల అదుపులో నలుగురు నిందితులు

భాకరాపేట/తిరుపతి(నేరవిభాగం),జూలై 26: తిరుపతికి చెందిన వ్యాపారి కిడ్నాప్ కథ చివరకు సుఖాంతమైంది.చిన్నగొట్టిగల్లు మండలం చెరువు ముందరపల్లెకు చెందిన భాస్కర కొన్ని సంవత్సరాలుగా తిరుపతిలోని మంగళం ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. కొబ్బరికాయల వ్యాపారం చేస్తున్న ఈయన ఆటో కూడా నడుపుతుంటాడు.సొంత పనుల నిమిత్తం బుధవారం స్వగ్రామానికి వచ్చి తిరిగి తిరుపతికి వెళుతూ మార్గమధ్యంలోని చిన్నగొట్టిగల్లు వద్ద కిడ్నాప్ అయ్యాడు.తన కుమారుడు రెడ్డికిరణ్‌కు వాట్సప్ కాల్ చేసి తాను కిడ్నాపర్ల చెరలో వున్నట్లు తెలియ జేశాడు.రెడ్డికిరణ్ వెంటనే భాకరాపేట పోలీసులకు కిడ్నాప్ విషయం తెలిపాడు.రంగంలోకి దిగిన పోలీసులు ఫోన్ నెంబరు ఆధారంగా కిడ్నాపర్లు వెళుతున్న వాహనం లోకేషన్‌ను గుర్తించి పీలేరు సమీపంలో వెంబడించారు.పోలీసుల రాకను గుర్తించిన నలుగురు కిడ్నాపర్లు వారి వాహనాన్ని ఢీకొట్టి తిరుపతి వైపు పారిపోతుండగా చంద్రగిరి మండలం కాలూరు క్రాస్ వద్ద మరో పోలీసు బృందం కిడ్నాపర్లను అటకాయించింది.ఇదే సమయంలో కిడ్నాపర్ల వాహనం టైరు పంక్చర్ కావడంతో పోలీసులకు దొరికిపోయారు.కిడ్నాపర్ల ముఠాలో చిన్నగొట్టిగల్లుకు చెందిన జిషామ్‌తో పాటు బెంగళూరుకు చెందినవారున్నారని సమాచారం. ఎర్రచందనం స్మగ్లింగుతో కిడ్నాపర్లకు సంబంధమున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.ఆర్థిక లావాదేవీలే కిడ్నాప్‌కు కారణమని పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు.కిడ్నాప్ ఘటనకు సంబంధించి తిరుచానూరు స్టేషన్‌లో జీరో ఎఫ్ఐఆర్ నమోదై భాకరాపేట పోలీసులకు బదిలీ చేయబడింది.ఎస్పీ సుబ్బరాయుడి పర్యవేక్షణలో భాకరాపేట సీఐ మస్తాన్‌వలి, ఇన్‌ఛార్జ్ ఎస్ఐ ఈశ్వరయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



టీటీడీ సీఈ నియామకంలో సీనియారిటీ పాటించండి

- హైకోర్టు సూచన

తిరుమల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): టీటీడీ చీఫ్ ఇంజనీర్ నియామకాన్ని ఏపీ హైకోర్టు తప్పుబట్టింది. సీనియారిటీకి అనుగుణంగానే సీఈ నియామకం జరపాలని టీటీడీని ఆదేశించింది. సీనియారిటీ ఉన్నప్పటికీ తనకు సీఈగా పదోన్నతి కల్పించలేదని, జూనియర్‌గా ఉన్న నాగేశ్వరరావుకు పదోన్నతి కల్పించారంటూ ఎస్ఈ సత్యనారాయణ 2019లో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై గతంలో కోర్టు కూడా స్పందిస్తూ సర్వీస్ రూల్స్‌కు అనుగుణంగా పదోన్నతి కల్పించాలని పలుమార్లు టీటీడీని ఆదేశించింది.నాగేశ్వరరావు ఫిట్ పర్సన్ అని, రికార్డ్స్ పరిశీలించి అతన్ని ఏకగ్రీవంగా సీఈగా ఎంపిక చేసినట్టు టీటీడీ కోర్టుకు వివరించింది.అయితే పిటిషన్‌దారు సమర్పించిన రికార్డులను పరిశీలించిన హైకోర్టు సత్యనారాయణ సీఈ పోస్టుకు అర్హుడని స్పష్టం చేసింది. డీపీసీ(డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ) నియమ నిబంధనలు పాటిస్తూ సత్యనారాయణను 2020 నుంచే సీఈగా పరిగణించాలని తీర్పు ఇచ్చింది.

హైకోర్టు తీర్పుపై దర్యాప్తు చేయండి:బీజేపీ

టీటీడీ చీఫ్ ఇంజనీర్ నియామకంపై హైకోర్టు ఇచ్చిన తీర్పుతో అయినా సమగ్ర దర్యాప్తునకు ఆదేశించి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని తిరుపతి బీజేపీ నేత నవీన్‌కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. టీటీడీ గత అదనపు ఈవో ధర్మారెడ్డి, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, ధర్మకర్తల మండలి ఛైర్మను స్వార్థ ప్రయోజనాల కోసం తమకు అనుకూలమైన వ్యక్తికి సీఈ బాధ్యతలు అప్పగించారన్నారు.అనుకూలమైన వ్యక్తిని నియమించడం ద్వారా టెండర్ల ద్వారా ఈ ప్రొక్యూర్మెంట్, ఆన్‌లైన్ టెండర్లలో కాంట్రాక్టర్ల వివరాలను ముందే తెలుసుకుని వారిని బెదిరించి రాజీ చేసిన తర్వాత తమకు అనుకూలమైన వారికి పనులు అప్పజెప్పి కమీషన్లు దండుకోవచ్చనే కుట్రతోనే నిబంధనలకు వ్యతిరేకంగా పదోన్నతులు కల్పించారన్నారు.

నేడు ఎంబీయూలో బెలూన్ శాటిలైట్ ప్రయోగం

చంద్రగిరి, జూలై 26 : ఎ.రంగంపేట సమీపంలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు బెలూన్ శాటిలైట్‌ను నింగిలోకి ప్రయోగించనున్నారు. ఎంబీయూ విద్యార్థులు తయారు చేసిన శాటిలైట్‌కు సంబంధించి అన్ని పరికరాలు పాకాల మండలం గాదంకి సమీపంలోని జాతీయ వాతావరణ పరిశోధనా ప్రయోగశాల(ఎన్ఏఆర్ఎల్), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(ఐఐఎస్టీ) సహకారంతో అభివృద్ధి చేశారు. కార్బన్ డయాక్సైడ్ స్థాయి, ఓజోన్ సాంద్రత, ఉష్ణోగ్రత, తేమ, వాతావరణ పీడనం వంటి పర్యావరణ పరిమితులను పర్యవేక్షించడానికి ఈ శాటిలైట్‌ను రూపొందించారు.ఇస్రో శాస్త్రవేత్తలు వీరముత్తువేల్, కల్పనా కాళహస్తి, తెన్మొయి శెల్వి, గోపీకృష్ణ, వెంకటరత్నం, ఎంబీయూ ఛాన్సలర్ మోహన్‌బాబు, ప్రొ ఛాన్సలర్ మంచు విష్ణు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినయ్ మహేశ్వరి, వైస్ ఛాన్సలర్ నాగరాజరామారావు, చీఫ్ గ్రోత్ అండ్ స్ట్రాటజిక్ ఆఫీసర్ వికాస్ సింగ్, ఆర్ అండ్ డీ డీన్ ఈశ్వర్ తదితరులు పాల్గొంటారు.

డబ్బుకోసం ఫ్రెండ్‌కే వల !

- బ్లాక్‌మెయిల్ కేసులో లా విద్యార్థులైన దంపతులకు రిమాండు

తిరుపతి (నేరవిభాగం/విశ్వవిద్యాలయాలు), జూలై 26: తిరుపతిలో ఓ లా విద్యార్థిని సస్పెండయ్యారు. ప్రస్తుతం ఐదేళ్ళ లా ఇంటిగ్రేటెడ్ ఏడవ సెమిస్టర్ చదువుతూ బ్లాక్‌మెయిల్ కేసులో ఇరుక్కున్న ఆమెను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు.పోలీసుల కథనం మేరకు...ఎర్రావారిపాలేనికి చెందిన కృష్ణకిషోర్ రెడ్డి తిరుపతిలోని పుదిపట్లలో వుంటూ బీఎల్ చదువుతున్నాడు. తమిళనాడుకు చెందిన ఈయన భార్య సదాశివం ప్రణవ్ కృష్ణ కూడా బీఎల్ ఫైనల్ ఇయర్ చదువుతోంది.డబ్బు సంపాదన కోసం తన సహాధ్యాయి అయిన కర్నూలుకు చెందిన మహిళతో ప్రణవ్ కృష్ణ పరిచయం పెంచుకుంది.తన ఇంటికి తీసుకెళ్ళింది.కూల్‌డ్రింక్‌లో మత్తుమందు కలిపి ఇచ్చింది. ఆమె మత్తులో వున్నప్పుడు భర్త కృష్ణకిషోర్‌తో కలిపి అసభ్య ఫొటోలు,వీడియోలు తీసింది.వాటిని ఆ మహిళతో పాటు ఆమె అన్నకు, కాబోయే భర్తకు వీడియోలు, ఫొటోలు తీసి పంపింది.భర్తతో కలిసి పెద్దఎత్తున డబ్బులు డిమాండు చేసింది.పదే పదే డబ్బు కోసం వేధిస్తుండడంతో ఆ మహిళ శుక్రవారం ఎంఆర్‌పల్లి పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు సీఐ అహ్మద్ నేతృత్వంలో ఎస్ఐ నాగేంద్రబాబు కేసు నమోదు చేశారు.నిందితులైన సదాశివం ప్రణవ్‌కృష్ణ, కృష్ణకిషోర్ రెడ్డిలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఎస్వీ ప్రాణదానం ట్రస్టుకు రూ.1.5 కోట్ల విరాళం

తిరుమల,జూలై 26 (ఆంధ్రజ్యోతి):టీటీడీ నిర్వహిస్తున్న ఎస్వీ ప్రాణదానం ట్రస్టుకు శుక్రవారం రూ.1.5 కోట్లు విరాళంగా అందాయి. తెనాలికి చెందిన సత్యశ్రీనివాస్(నేషనల్ స్టీల్స్ సీఎఫ్‌వో) ఈ విరాళాన్ని తిరుమలలో టీటీడీ ఈవో శ్యామలరావుకు అందజేశారు.



టీటీడీ ఈవోకు చెక్ అందజేస్తున్న సత్యశ్రీనివాస్

ఎస్ఎస్‌డీ సంస్థ పేరుతో రూ.5లక్షల డిమాండ్

ఎస్పీకి ఫిర్యాదు చేసిన డీఎంహెచ్‌వో

తిరుపతి(వైద్యం), జూలై 26: సమతా సైనిక్ దళ్(ఎస్ఎస్‌డీ) సంస్థ పేరుతో బెదిరింపులకు గురి చేస్తూ రూ.5లక్షలు డిమాండ్ చేస్తున్నారంటూ డీఎంహెచ్‌వో శ్రీహరి శుక్రవారం ఎస్పీ సుబ్బరాయుడికి ఫిర్యాదు చేశారు. కొంతకాలంగా కల్యాణ్, సుబ్రహ్మణ్యం, నాగేంద్రలు ఎస్ఎస్‌డీ సంస్థ పేరుతో తనను నగదు డిమాండ్ చేయడంతోపాటు ఇవ్వకుంటే తప్పుడు ప్రచారాలకు తెరలేపుతామని బెదిరిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పైగా నేరుగా ఇంటికే వచ్చి బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. దీనికి సంబంధించిన పూర్తి ఆధారాలు కూడా ఎస్పీకి అందజేసినట్లు శ్రీహరి తెలిపారు.

ఫిర్యాదు చేసినందుకు కేసు పెట్టారు

వైద్య ఆరోగ్య శాఖలో అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న జిల్లా వైద్యాధికారి శ్రీహరిపై సమతా సైనికదళ్ సంస్థ తరపున కలెక్టర్‌కు, హెల్త్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినందుకు తనపై అక్రమ కేసులు పెడుతున్నారని, సమతా సైనికదళ్ జిల్లా కార్యదర్శి గండికోట సుబ్రమణ్యం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాము డీఎంహెచ్‌వోను ఎలాంటి నగదు డిమాండ్ చేయలేదని పేర్కొన్నారు.

తహసీల్దార్ల బదిలీకి గ్రీన్ సిగ్నల్

- జిల్లా నుంచి రిలీవ్ అయిన 34మంది

తిరుపతి(కలెక్టరేట్), జూలై 26: ఎన్నికల ప్రక్రియ ముగిసి, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. పొరుగు జిల్లాల్లోని తహసీల్దార్లను సొంత జిల్లాలకు బదిలీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నాలుగురోజుల క్రితం సీసీఎల్ఏను ఆదేశించింది. అయితే అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో రికార్డులు దగ్ధమైన కారణంగా తహసీల్దార్ల బదిలీలకు బ్రేక్ పడింది. ఎట్టకేలకు ప్రభుత్వం నుంచి శుక్రవారం రాత్రి తహసీల్దార్లను రిలీవ్ చేయాలని చెప్పడంతో కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాలు ఇచ్చారు. జిల్లాలో పనిచేస్తున్న 34 మంది పొరుగు తహసీల్దార్లు ఆయా మండలాల్లోని డీటీలకు బాధ్యతలు అప్పగించి రిలీవ్ అయ్యారు. ఇక పొరుగు జిల్లాల్లో పనిచేస్తున్న సుమారు 42మంది మన జిల్లాకు చెందిన తహసీల్దార్లు శనివారం సాయంత్రానికి కలెక్టరేట్‌లో రిపోర్టు చేయనున్నారు. వీరందరికీ రెండు, మూడ్రోజుల్లో పోస్టింగ్స్ ఇవ్వనున్నారు.

ప్రాధాన్యత మండలాల కోసం పైరవీలు

ఇప్పటికే రాష్ట్రంలోని ఉన్నతాధికారులు, ఆయా నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలు,రాజకీయ నేతల నుంచి కొందరు తహసీల్దార్లు పైరవీలు మొదలుపెట్టారు. తమకు ప్రాధాన్యత గల మండలం కావాలని జిల్లా అధికారులపై తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు తెస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ భూములను అప్పటి ఎమ్మెల్యేలకు అప్పనంగా అప్పజెప్పిన తహసీల్దార్లను దూరంగా పెట్టి.. నిజాయితీగా పనిచేసేవారికి అవకాశం ఇవ్వాలని కూటమి నేతలు ప్రభుత్వానికి ఇప్పటికే విన్నవించారు.

వెంకటగిరి అభివృద్ధికి సహకరించండి

ఎమ్మెల్యే కురుగొండ్ల



స్పీకర్, మంత్రి నిమ్మలతో ఎమ్మెల్యే

వెంకటగిరి, జూలై 26: నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామా నాయుడికి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశం అనంతరం స్పీకర్ అయ్యన్న పాత్రుడు, మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం నియోజకవర్గంలో నీటిపారుదల శాఖ పరిధిలోని ప్రాజెక్టుల నిర్మాణాన్ని గత వైసీపీ ప్రభుత్వం అర్ధాంతరంగా నిలిపివేసిందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రూ.400 కోట్ల అంచనాతో 2016లో టీడీపీ ప్రభుత్వంలో ఆల్తూరుపాడు రిజర్వాయర్ మంజూరైందని, కొంతమేర పనులు జరిగాయ న్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పనులను నిలిపివేసింద న్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే ఉమ్మడి నెల్లూరు జిల్లాతో పాటు తిరుపతి జిల్లాలో సుమారు లక్షా 60వేల ఎకరాలకు సాగునీరు, తిరుపతి నగరం, శ్రీకాళహస్తి పట్టణానికి తాగునీరు అందుతుందని చెప్పారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు కురుగొండ్ల చెప్పారు.

మహిళల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు



హోం మంత్రి అనితతో లీలావతి తదితరులు

గూడూరు, జూలై 26: మహిళల రక్షణ కోసం టీడీపీ ప్రభుత్వం ప్రత్యేక చట్టాలు తీసుకురానున్నట్లు హోం మంత్రి అనిత తెలిపినట్లు తెలుగుమహిళ రాష్ట్ర కార్యదర్శి గుండాల లీలావతి పేర్కొన్నారు. శుక్రవారం అమరావతిలో తెలుగు మహిళా నేతలతో హోం మంత్రి అనిత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లీలావతి మాట్లాడుతూ... మహిళలపై ఎక్కడ అన్యాయం జరిగినా టీడీపీ అండగా ఉంటుందన్నారు. అన్యాయాలకు పాల్పడేవారిపై కఠిన శిక్షలు అమలు చేస్తామ న్నారు. అదేవిధంగా అసెంబ్లీ ఆవరణలో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌ను లీలావతి మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు.

కమ్మపల్లి గిరిజన కాలనీలో వైద్యశిబిరం

డక్కిలి, జూలై 26: మండలంలోని కమ్మపల్లి గిరిజన కాలనీలో చిన్నారులు కామెర్ల బారిన పడుతున్నారని ఫిర్యాదులు అందడంతో శుక్రవారం స్థానిక వైద్యుడు శ్రీహరి ఆధ్వర్యంలో వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా చిన్నారుల రక్త నమూనాలు సేకరించారు. గ్రామంలో ఒకరిద్దరకు మినహ కామెర్లు ఎక్కువ మందికి బయట పడలేదన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. ఇక ఎంపీడీవో లీలామాధవి ఆధ్వర్యంలో కాలనీలో తాగునీటి నమూనాలు సేకరించి, పారిశుధ్య పనులు చేయించారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు: జడ్జి అనూష



సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాది రాజారావు

వెంకటగిరి, జూలై 26: విద్యార్థులు ర్యాగింగ్ వంటి కార్యకలాకు పాల్పడితే చర్యలు తప్పవని వెంకటగిరి కోర్టు జడ్జి అనూష హెచ్చరించారు. హ్యాండ్లూమ్ కళాశాలలో జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడుతూ... వాహనాలు నడిపేటప్పుడు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ప్రతి ఒక్కరు జనన ధృవీకరణ పత్రం,ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు పొంది ఉండాలన్నారు. సీఐ సంగమేశ్వరరావు, న్యాయవాదులు రాజారావు, గాంధీ, గిరిజా కుమారి, రాజేష్, లావణ్య, స్వప్న పాల్గొన్నారు.

ఉపాధి పనులపై గ్రామసభలు

చిల్లకూరు, జూలై 26: మండలంలోని తిప్పగుంటపాళెం, కడివేడు గ్రామాల్లో శుక్రవారం 16వ విడత సామాజిక తనిఖీల్లో భాగంగా 2023-24 సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులపై అధికారులు, సామాజిక తనిఖీ బృందాల ఆధ్వర్యంలో గ్రామసభలు జరిగాయి. తిప్పగుంటపాళెంలో రూ.26లక్షలకు, కడివేడులో రూ.45.36లక్షలకు సంబంధించి పనులు జరిగాయన్నారు. కూలీలు, మస్టర్లకు సంబంధించి అభ్యంతరాలుంటే సభ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఎవరూ అభ్యంతరం వ్యక్తం చేయ లేదు. కార్యక్రమంలో ఏపీవో గిరిబాబు, ఎస్ఆర్‌పీ రవి తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా క్రికెట్ పోటీలు

చిల్లకూరు, జూలై 26: మండలంలోని మోమిడి గ్రామంలో జరుగుతున్న జిల్లాస్థాయి క్రికెట్ పోటీల్లో ఉదయం మోమిడి - పొన్నవోలు జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. మొదట బ్యాటింగ్ చేపట్టిన మోమిడి జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 10 వికెట్లు నష్టానికి 137 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన పొన్నవోలు జట్టు 12 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 133 పరుగులు చేసి ఓటమిపాలైంది. మధ్యాహ్నం ఆకుతోట - తూర్పుకనుపూరు జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన ఆకుతోట జట్టు 117 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన తూర్పుకనుపూరు జట్టు 11.4 ఓవర్లలో 96 పరుగులకే ఆలౌటైంది.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

గూడూరు అర్బన్, జూలై 26: బాల్యవివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని ఐసీడీఎస్ సీడీపీవో మెహబూబి అన్నారు. శుక్రవారం గాంధీనగర్‌లో బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... బాల్యవివాహాలను ప్రోత్సహించడం నేరమన్నారు. అదేవిధంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జ్యోతికిరణ్, స్వరూపారాణి, అర్చన తదితరులు పాల్గొన్నారు.


నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గూడూరు అర్బన్, జూలై 26: స్థానిక 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గూడూరు పట్టణం, చిల్లకూరు ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో డీఈ ప్రసాద్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

అక్రమ నిర్మాణాలను అడ్డుకోండి

బాలాయపల్లి, జూలై 26: మండలంలోని మేల్చూరులో సర్వే నెం.8లో అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని గ్రామానికి చెందిన దళితులు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తమ గ్రామంలో 1985లో పెద బత్తెయ్య, డిల్లియ్య, పొందయ్యకు ఒక్కొకరికి 5 సెంట్లు చొప్పున ఇంటి స్థలాలు ఇచ్చారన్నారు. అయితే అదే గ్రామానికి చెందిన శివరామ్ ప్రసాద్, శంకరయ్య తమకిచ్చిన స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. అనంతరం తహసీల్దార్ కె.పుల్లారావుకు వినతిపత్రం అందజేశారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి



తుపాకీ ఆకృతిలో గాయత్రి పాఠశాల విద్యార్థులు

గూడూరు, జూలై 26: కార్గిల్ యుద్ధంలో అమరవీరుల త్యాగాలు మరువలేనివని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మనోజ్‌కుమార్ అన్నారు. కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా శుక్రవారం రెండో పట్టణ పరిధిలోని ఓ ప్రైవేటు కళాశాలలో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1999లో కార్గిల్ యుద్ధంలో 527మంది సైనికులు దేశం కోసం అమరులయ్యారన్నారు. వారిని స్మరించుకోవడం బాధ్యత అన్నారు. మల్లికార్జున, మహేష్, కిరణ్, శివశంకర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా గాయత్రి పాఠశాలలో కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా విద్యార్థులు తుపాకీ ఆకృతిలో కూర్చొని కార్గిల్ అమరవీరులకు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ శివకుమార్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థిదశ నుంచే దేశభక్తిని పెంపొందించుకోవాలన్నారు.

తవ్వింది ఎంత.. దోచింది ఎంత?

- క్వార్ట్జ్, సిలికా అక్రమాలపై ప్రభుత్వం సీరియస్
- పూర్తిస్థాయి విచారణకు ఆదేశం
- పలు జిల్లాల అధికారులతో ఏడు బృందాలు
- ప్రభుత్వ నిర్ణయంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు

అధికారమే అండగా వైసీపీ నేతలు సాగించిన దోపిడీ అంతా ఇంత కాదు. క్వార్ట్జ్ (తెల్లరాయి), సిలికా వంటి విలువైన ప్రజాసంపదను కొల్లగొట్టి రూ.వేల కోట్లు దోచుకున్నారు. ఈ అక్రమాల పుట్ట బద్ధలయ్యే సమయం ఆసన్నమైంది. జిల్లాలోని ఖనిజ సంపద దోపిడీని ఎన్డీయే కూటమి ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలో జరిగిన ఈ దోపిడీపై విచారణకు ఆదేశించింది. పలు జిల్లాల అధికారులతో ఏడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. వెంటనే నెల్లూరుకు చేరుకున్న విచారణాధికారులు తవ్వకాలు జరిగిన ప్రాంతాల్లో కొలతలు తీస్తున్నారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదిక సమర్పించున్నారు. ఆ నివేదికలు అందిన వెంటనే ప్రభుత్వం క్రిమినల్ కేసులతో పాటు అక్రమార్కుల నుంచి దోచుకున్న ప్రజా సంపదను రికవరీ చేయాలని నిర్ణయించుకుంది. దీంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

నెల్లూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): సైదాపురం, పొదలకూరు, గూడూరు రూరల్, రాపూరు మండలాల్లో ఎక్కడపడితే అక్కడ వైసీపీ నాయకులు విచ్చలవిడిగా తెల్లరాయిని తవ్వుకెళ్లారు. ప్రభుత్వం, అటవీ భూములతోపాటు పట్టా భూముల్లోనూ రైతులు, మైనింగ్ లీజుదారులను బెదరించి క్వార్ట్జ్‌ను కొల్లగొట్టారు. అప్పట్లో ప్రతిపక్ష నేతలు ఈ తవ్వకాలను అడ్డుకున్నా, ప్రజలు గగ్గోలు పెట్టినా ప్రభుత్వ పెద్దలు పట్టించుకోలేదు. వైసీపీ నేతలే తెరవెనుక ఇదంతా చేయించడంతో నాడు ఎవరూ నోరు మెదపలేదు. చివరకు టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడంతో అధికార యంత్రాంగం ఎన్నికల కోడ్ వచ్చాక విచారణకు పూనుకుంది. దాదాపు ఆరు లక్షల మెట్రిక్ టన్నుల క్వార్ట్జ్‌ను దోపిడీ చేసినట్లు నిర్ధారించి, రూ.255 కోట్ల పెనాల్టీలు విధించారు. దీని విలువ బహిరంగ మార్కెట్లో రూ.వేల కోట్లు ఉంటుంది. ఈ అక్రమ తవ్వకాలకు వైసీపీ నేతలు బాధ్యులని గుర్తించి దాదాపు 200 మందికి మైనింగ్ అధికారులు నోటీసులు కూడా జారీ చేశారు. తాజాగా మరోసారి క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలపై పూర్తిస్థాయిలో విచారించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

● బెదిరించి లాగేసుకుని..!

చిల్లకూరు, కోట మండలాల్లోని అరుదైన సిలికా ఖనిజాన్ని వైసీపీ నేతలు హైజాక్ చేశారు. లీజుదారులను బెదరించి మైన్‌లను బలవంతంగా లాగేసుకున్నారు. 80 లీజులు ఉండగా అన్నిటినీ వైసీపీ నేతల చేతుల్లోకి వెళ్లిపోయాయి. నాడు మైనింగ్ లీజుదారులు టన్ను సిలికాను రూ.400 ధరతో డీలర్ లైసెన్సుదారులకు విక్రయించేవారు. వీరు కంపెనీలకు రూ.600 చొప్పున విక్రయించుకునేవారు. కానీ వైసీపీ ప్రభుత్వం వచ్చాక సిలికా మొత్తాన్ని లాగేసుకొని మైన్ లీజుదారులకు టన్ను రూ.100 చొప్పున ఇచ్చారు. అదే సిలికాను డీలర్ లైసెన్సుదారులకు రూ.1400 చొప్పున అమ్మడం ప్రారంభించారు. డీలర్లు టన్ను సిలికాను రూ.1800కు కంపెనీలకు విక్రయించాల్సి వచ్చింది. దీంతో కంపెనీలన్నీ జిల్లాలోని సిలికాకు బదులు గుజరాత్, రాజస్థాన్ ప్రాంతాల నుంచి కొనుగోలు చేయడం మొదలుపెట్టాయి. ఇక అక్రమార్కులు దాదాపు 400 ఎకరాల ప్రభుత్వ భూముల్లో కూడా సిలికాను తవ్వేశారు. కొందరు రైతులను బెదిరించి ఎకరానికి రూ.3 లక్షల చొప్పున ఇచ్చి ఆ భూముల్లో కూడా సిలికాను ఎత్తేశారు. ఇలా ఐదేళ్లపాటు సాగించిన దోపిడీ ద్వారా రూ.వేల కోట్ల ప్రజా సంపదను కొల్లగొట్టారు.



సైదాపురంలో అక్రమ తవ్వకాలపై ఆరా తీస్తున్న విచారణాధికారులు

● విచారణకు ఏడు బృందాలు

సిలికా, క్వార్ట్జ్ అక్రమాలపై విచారణకు ఏడు బృందాలను ఏర్పాటు చేస్తూ మైనింగ్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ రెండు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేశారు. మూడు బృందాలకు నెల్లూరు మైనింగ్ డీడీ శ్రీనివాస కుమార్, మరో నాలుగు బృందాలకు గూడూరు డివిజన్ మైనింగ్ అధికారి డీవీ రంగకుమార్ నేతృత్వం వహిస్తున్నారు. నెల్లూరు, ఒంగోలు, మార్కాపురం, తిరుపతి, గూడూరు, పలమనేరు, చిత్తూరు, దాచేపల్లి మైనింగ్ కార్యాలయాల అసిస్టెంట్ జియాలజిస్టులు, సర్వేయర్లు, సూపర్‌వైజర్లు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్లు, టెక్నికల్ అసిస్టెంట్లను విచారణ బృందాల్లో సభ్యులుగా నియమించారు. నెల్లూరు, గూడూరు మైనింగ్ కార్యాలయాల పరిధిలో ఉన్న అన్ని క్వార్ట్జ్, మైకా, ఫెల్డ్‌స్పార్, సిలికా లీజు మైన్లలో తనిఖీలు నిర్వహించాలని, అనధికారిక తవ్వకాలు జరిగిన ప్రదేశాల్లోనూ తనిఖీలు నిర్వహించి నివేదికలను సమర్పించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అధికారుల తీరు మారకుంటే ప్రభుత్వానికి ఫిర్యాదు

● టీడీపీ నేతల హెచ్చరిక



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సంచి కృష్ణయ్య

పెళ్లకూరు, జూలై 26: కొందరు అధికారుల తీరు.. కొందరు అక్రమార్కుల విధానాలతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని కొత్తూరులో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మండలంలో అవినీతి, అక్రమాలను అరికట్టేందుకు అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని కోరారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారినా.. మండలంలో అధికారుల తీరులో మార్పు రాలేదన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అక్రమార్కులతో కుమ్మక్కై అవినీతికి పాల్పడిన విధానాలను ఇంకా కొనసాగిస్తునరన్నారు. రెవెన్యూ, పోలీసు అధికారుల తీరు బాధాకరంగా ఉందన్నారు. ఇప్పటికైన వీరి తీరు మార్చుకోక పోతే సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి రాత పూర్వకంగా ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీస్, రెవెన్యూ, మైనింగ్ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి వి.శేఖర్‌నాయుడు, టీడీపీ సీనియర్ నేత డి.ప్రసాద్‌నాయుడు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో ఎలాంటి అవినీతి, అక్రమాలు జరగడానికి వీలు లేదన్నారు. రెవెన్యూ అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించకుండా రైతులు, సామన్య ప్రజలు, విద్యార్థుల అవసరాలను తీర్చాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతికి స్వస్తి పలకాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మురళీనాయుడు, రవి, పరుశురాం, సురేష్, కృష్ణమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యానగర్‌లో విజయ్ దివస్ ర్యాలీ



విద్యానగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

కోట, జూలై 26: మండలంలోని విద్యానగర్‌లో ఎన్‌బీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్ల ఆధ్వర్యంలో కార్గిల్ యుద్ధ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ శుక్రవారం విజయ్ దివస్ ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీని కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. 25 సంవత్సరాల క్రితం కార్గిల్‌లో భారత సైనికులు వీరోచితంగా పోరాడి పాకిస్థాన్‌ను ఓడించారని విజయకుమార్‌రెడ్డి చెప్పారు. ఈ పోరాటంలో 527మంది భారత సైనికులు అమరుల య్యారని వారి కుటుంబాలకు రుణపడి ఉంటూ వారి త్యాగాలను స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం స్థానిక ఇంజినీరింగ్ కళాశాల నుంచి విద్యానగర్ గాంధీబొమ్మ సెంటర్ వరకు ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు మాధవయ్య, మల్లికార్జున్‌రెడ్డి, శోభారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో కార్పొరేట్ విద్యపై ప్రచారం

కోట, జూలై 26: అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్పొరేట్ స్థాయిలో జరుగుతున్న విద్యా బోధనపై విస్తృత ప్రచారం చేయాలని సీడీపీవో మునికుమారి అన్నారు. కోటలోని స్త్రీ, శిశు సంక్షేమ ప్రాజెక్టు కార్యాలయంలో శుక్రవారం కోట సెక్టార్ అంగన్‌వాడీ వర్కర్ల సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ... అంగన్‌వాడీ కేంద్రాలపై తల్లిదండ్రులకు నమ్మకం కలిగేలా ప్రచారం చేయాలన్నారు. అదే విధంగా ప్రతి వర్కర్ సమయ పాలన పాటించాలన్నారు. చిన్నారుల ప్రతిభపై నివేదిక పంపాలన్నారు. సూపర్ వైజర్లు కృష్ణమ్మ, కవిత తదితరులు పాల్గొన్నారు.

మడ అడవులతో పర్యావరణ రక్షణ

సూళ్లూరుపేట, జూలై 26: మడ అడవుల పెంపకం ద్వారా పర్యావరణాన్ని రక్షించుకోవచ్చునని డీఎఫ్‌వో శామ్యూల్ అన్నారు. వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎకో క్లబ్, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సంయుక్తంగా అంతర్జాతీయ మడ అడవుల సంరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ కన్వీనర్ అరుణ మడ అడవుల ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం విద్యార్థులకు మడ అడవులపై క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎల్‌బీ శంకర్ శర్మ, అధ్యాపకులు ఎస్.శ్రీనివాస్, సుబ్రమణ్యం శాస్త్రీ, ఏడుకొండలు, విక్టోరియా రాణి, అమ్మాజీ, సునీత తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా అన్న క్యాంటీన్ పనులు



సూళ్లూరుపేటకు, జూలై 26: పట్టణంలో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు మున్సిపల్ అధికారులు చకచకా పనులు చేస్తున్నారు. పేదల ఆకలి తీర్చేందుకు రూ.5 కే భోజనం పెట్టేందుకు టీడీపీ ప్రభుత్వ హయాంలో గాండ్లవీధిలో రూ.40 లక్షలతో భవనం నిర్మించి అన్న క్యాంటీన్ ఏర్పాటు చేశారు. 2019లో వైసీపీ అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్‌ను ఎత్తివేసింది. దీంతో ఆ భవనంలో పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మళ్లీ టీడీపీ అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. భవనానికి రంగులు వేసి ఆగస్టు 15న క్యాంటీన్‌ను ప్రారంభించేందుకు మున్సిపాలిటీ అధికారులు సిద్ధం చేస్తున్నారు.

10 మంది 'ఎర్ర'స్మగ్లర్ల అరెస్టు

ఆరు దుంగలు, రెండు కార్లు స్వాధీనం



స్మగ్లర్ల వివరాలు తెలియజేస్తున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

మంగళం, జూలై 26: టాస్క్‌ఫోర్స్ పోలీసులు పది మంది ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ఆరు దుంగలు, రెండు కార్లు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలతో టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఐ కె.కృపానంద, ఆర్ఎస్ఐ కె.సురేష్ బాబుకు చెందిన బృందం దొరవారిసత్రం-నాయుడుపేట అటవీ ప్రాంతంవైపు శుక్రవారం కూంబింగ్ చేపట్టారు. అక్కడినుంచి సూళ్లూరుపేట బీటు పరిధిలోని తల్లంపాడు గ్రామం సమీపంలో ఉన్న జాతీయ రహదారిలో వాహనాల తనిఖీ నిర్వహించారు. అటువైపు వచ్చిన రెండు కార్లు వీరిని చూసి కొద్దిదూరంలోనే ఆపేసి, అందులోని వారు పారిపోయే ప్రయత్నం చేశారు. గమనించిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు వెంబడించి పది మంది పట్టుకున్నారు. వీరు.. తమిళనాడు వేలూరు జిల్లా ఆనైకట్టుకు చెందిన రాజమణి గోవిందస్వామి(41), విజయకుమార్(32), శివకుమార్ వెల్లియన్ (26), కుమార్ ముత్తు(29), అరుల్ ముత్తుస్వామి(23), ప్రభురాజ్(25), అశోక్ కుమార్ (29), ఎం.గోపి (26), జ్ఞానశేఖర్ చిన్నతంబి (19), పూవరాసన్ వరదన్(27)గా గుర్తించారు. పరారైన మిగిలిన వారికోసం గాలిస్తున్నారు. ఆరు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, వాహనాలను సీజ్ చేశారు. సీఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు



చిరు వ్యాపారులకు సూచనలు ఇస్తున్న డీఎస్పీ

నాయుడుపేట టౌన్, జూలై 26: పట్టణంలో రాకపోకలకు అంతరాయం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నాయుడుపేట డీఎస్పీ శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. పాత బస్టాండ్ సమీపం నుంచి భరత్‌నగర్‌కు వెళ్లే దారి వెంబడి నిబంధనలకు అతిక్రమించి దుకాణాలను నిర్వహించడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని దీంతో ఆయా దుకాణదారులు నిబంధనలు అతిక్రమించ కూడదని డీఎస్పీ చెప్పారు. డీఎస్పీ వెంట నాయుడుపేట అర్బన్ సీఐ శ్రీనివాసులురెడ్డి, ఎస్ఐ గోపీ, సిబ్బంది ఉన్నారు.

మూడు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

దొరవారిసత్రం, జూలై 26: మండలంలో గురువారం అర్ధరాత్రి మూడు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు గాయపడ్డారు. వీఎస్ఆర్ నగర్ వద్ద జాతీయ రహదారిపై బుదూరు గ్రామానికి చెందిన బి.వాసు డివైడర్‌ను ఢీకొనడంతో తలకు గాయమై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. హైవే పోలీసులు తిరుపతి రుయాకు తీసుకెళ్లారు. పడమటికండ్రిగ చెరువు సమీపంలో అడవిలో పూలతోట ఆర్అండ్‌బీ రహదారిలో పందిని ఢీకొని సత్యవేడుకు చెందిన ప్రళయకావేరి వెంకటేశ్వర్లు గాయపడ్డాడు. గస్తీ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులును నాయుడుపేటకు తరలించారు. అలాగే కుప్పారెడ్డిపాళెం దాబా వద్ద జాతీయ రహదారిపై ఫ్లిప్‌కార్ట్ పార్శిల్ విభాగానికి చెందిన లగేజీ ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో ఆటో డ్రైవర్ శ్రీనివాసులు స్వల్పంగా గాయపడ్డాడు. రహదారికి అడ్డుగా పడిపోవడంతో కొంత సేపు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. దీంతో స్థానిక పోలీసులు రాకపోకలు క్రమబద్ధీకరించారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడులు

వెంకటగిరి టౌన్, జూలై 26: భూసార పరీక్షలకు అనుగుణంగా సాగు చేస్తే అధిక దిగుబడులు వస్తాయని ఏడీఏ నాగార్జున సాగర్ అన్నారు. శుక్రవారం పెట్లూరు గ్రామంలో ఆత్మ సహకారంతో భూసార పరీక్షలు, ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. భూసార పరీక్షలను బట్టి అవసరమైన మేరకు ఎరువులను వినియోగించాలన్నారు. నేలల ఆరోగ్యం పెంచేందుకు వ్యవసాయ శాఖ రాయితీపై అందిస్తున్న పిచ్చిరొట్ట విత్తనాలను వినియోగించుకోవాలని కోరారు. సస్యరక్షణ, కలుపు నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏవో సుజాత, సిబ్బంది వరలక్ష్మి, సతీష్, కేశవ తదితరులు పాల్గొన్నారు.

బిరదవాడలో మౌలిక సదుపాయాల ఏర్పాటు

నాయుడుపేట, జూలై 26: మున్సిపాలిటీలో విలీనమైన బిరదవాడ లో మౌలిక సదుపాయాలను కల్పిస్తామని మున్సిపల్ కమిషనర్ జనార్దన రెడ్డి చెప్పారు. శుక్రవారం ఆయన సిబ్బందితో కలిసి బిరదవాడ గ్రామాన్ని పరిశీలించారు. తాగునీరు, మురుగునీటి కాలువలు, వీధి లైట్లను సత్వరం ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం పుదూరులో ఉన్న బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను తనిఖీ చేశారు.

ఆక్రమణల తొలగింపు



రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న కంటైనర్‌ను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

నాయుడుపేట, జూలై 26: నాయుడు పేట రైల్వే స్టేషన్ ఎదురుగా ఆర్అండ్‌బీ స్థలంలో అక్రమ కట్టడాలను మున్సిపల్ అధికారులు తొలగించారు. రైల్వేస్టేషన్ సమీపంలో ఆర్అండ్‌బీ స్థలంలో కంటైనర్‌ను ఎక్స్‌కవేటర్ ద్వారా తొలగించి ఎల్ఏసీ ఎదురుగా ఉన్న మున్సిపాలిటీ స్థలానికి తరలించారు. టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ ఎస్.శాంతి, ప్లానింగ్ సెక్రటరీలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారు బదిలీ నిలిపివేత

ఓజిలి, జూలై 26: మండల తహసీల్దారు నాంచారయ్య బదిలీ ఆగిపోయింది. ఎన్నికల నేపథ్యంలో తహసీల్దారు నాంచారయ్య గుంటూరు జిల్లా నుంచి ఓజిలి తహసీల్దారుగా వచ్చారు. ఎన్నికల అనంతరం ఇతర జిల్లాల నుంచి వచ్చిన తహసీల్దార్లకు తిరిగి వారి జిల్లాలకు వెళ్లేలా ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో బుధవారం ఓజిలి తహసీల్దారు గుంటూరుకు వెళ్లేందుకు సిద్ధమవుతుండగా బదిలీ ఉత్తర్వులను తాత్కాలికంగా నిలిపివేస్తూ ఉత్తర్వులు వచ్చాయి. చిత్తూరు జిల్లా మదనపల్లి సంఘటనతోనే ఈ బదిలీకి బ్రేక్ పడిందని అధికారులు అంటున్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నాయుడుపేట టౌన్, జూలై 26: నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్‌శర్మ తెలిపారు. హిస్టరీ, పీడీ పోస్టుల కోసం అర్హులైన వారు జూలై 31వ తేదీలోగా కళాశాలలో దరఖాస్తులు అందించాలన్నారు.

డాక్టర్‌ని బెదిరించిన వారిపై కేసులు పెట్టండి

తిరుపతి(ఆటోనగర్), జూలై 26: బాలాయపల్లి మండలం సుబ్రమణ్యం గ్రామంలోని పీహెచ్‌సీలో గురువారం డాక్టర్‌ని బెదిరించిన టీడీపీ నాయకులపై కేసులు నమోదు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి డిమాండ్ చేశారు. దౌర్జన్యం చేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ఉద్యోగులను వేధించడం మానుకోని పక్షంలో తాము ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

ఏపీ పాలిసెట్‌కు 31న స్పాట్ అడ్మిషన్లు

గూడూరు అర్బన్, జూలై 26: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మిగిలివున్న సీట్లకు స్పాట్ అడ్మిషన్ విధానం ద్వారా భర్తీ చేయనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రవికృష్ణ శుక్రవారం తెలిపారు. పాలిసెట్ అర్హతలేని, ఓపెన్‌స్కూల్ చదవిన విద్యార్థులు ఈనెల 27 నుంచి 31వ తేదీ వరకు కళాశాలలో సంప్రదించాలన్నారు. సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, మైనింగ్ బ్రాంచ్‌లు ఉన్నాయన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు వివరాలకు ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలన్నారు. అదేవిధంగా స్థానిక ప్రభుత్వ సిరామిక్ కళాశాలలో ఈనెల 31వ తేదీ స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. పదో తరగతి విద్యాహర్హత కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని తెలిపారు.

కోస్టల్ కారిడార్ భూముల సర్వే



తమ్మినపట్నంలో సర్వే నిర్వహిస్తున్న అధికారులు

చిల్లకూరు, జూలై 26: మండలంలోని తమ్మినపట్నంలో చెన్నై - బెంగళూరు ఇండస్ట్రియల్ కోస్టల్ కారిడార్‌కు కేటాయించిన భూములను శుక్రవారం రెవెన్యూ సిబ్బంది సర్వే నిర్వహించారు. ఈ కారిడార్‌కు చిల్లకూరు మండలంలో 941 ఎకరాలు కేటాయించారు. ఎంత మేర రైతులు ఏ పంటలు సాగు చేస్తున్నారో అనే విషయాలకు సంబంధించి సర్వే నిర్వహిస్తున్నారు. డీటీ, ఆర్ఐ, వీఆర్‌వో తదితరులు పాల్గొన్నారు.

వెంకన్నపాళెంలో డ్రైడే

కోట, జూలై 26 : మండలంలోని వెంకన్నపాళెం పంచాయతీలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శి అల్లాబక్షు వైద్య సిబ్బంది, పారిశుధ్య కార్మికుల ఆధ్వర్యంలో డ్రైడే కార్యక్రమం జరిగింది. వెంకన్నపాళెం, వీరారెడ్డి సత్రంలల్లో బ్లీచింగ్ చల్లి దోమల నివారణకు చర్యలు తీసుకున్నారు.

వెటర్నరీలో పెరటికోళ్ల పెంపకంపై ముగిసిన శిక్షణ



మహిళా రైతులకు కోడిపిల్లల పంపిణీ

తిరుపతిరూరల్, జూలై 26: ఎస్వీవెటర్నరీ వర్సిటీలో పెరటికోళ్ల పెంపకంపై మహిళా రైతులకు నిర్వహించిన మూడ్రోజుల నైపుణ్యాభివృద్ధి శిక్షణ శుక్రవారంతో ముగిసింది. నిరంతర పశు వైద్య విద్య, సమాచార కేంద్రం ఆధ్వర్యంలో నార్మ్(ఐసీఏఆర్) ఆర్థిక సౌజన్యంతో జరిగిన శిక్షణకు ఓజిలి మండలానికి చెందిన ఆరిమేనుపాడు, కుందాం, ఓజిలి, పెదపరియ, కురుగొండ, చిలమానుచేను గ్రామాలకు చెందిన 30మంది మహిళా రైతులు హాజరయ్యారు. అతిథిగా హాజరైన వర్సిటీ డెరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్(డీఈ) సీహెచ్ శ్రీలతతో సీసీవీఈసీ కోఆర్డినేటర్ డాక్టర్ కె.సుజాత, నార్మ్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలక్రిష్ణన్ కలిసి అసీల్ జాతి కోడిపిల్లలు, వాటర్ ఫీడర్, క్రేన్స్‌ని పంపిణీ చేశారు. డాక్టర్ కె.జయశ్రీ పాల్గొన్నారు.